
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
కృష్ణా జిల్లా వార్తలు
బుధవారం 8 జనవరి 2025



సూత్రధారి ఏవోనే!

తోట్లవల్లూరులో పంటల పరిహారం పంపిణీలో అవినీతి

- పంట నష్టం నమోదులో అంతాతానై వ్యవహరించిన ఏవో
- సహకరించిన అగ్రికల్చర్ అసిస్టెంట్, వీఆర్వో
- తప్పుడు జాబితాతో పరిహారం సొమ్ము రూ.లక్షల్లో హాంఫట్
- ముఖ్యమంత్రికి రైతుల ఫిర్యాదు



నాగేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి

తోట్లవల్లూరు మండలంలో పంట నష్టపరిహారం పంపిణీలో జరిగిన అవినీతిలో వ్యవసాయాధికారి నాగేశ్వర రావే సూత్రధారి అని ఆరోపణలు వస్తున్నాయి. ఆయనకు అగ్రికల్చర్ అసిస్టెంట్ మౌనిక, వీఆర్వో నాగేశ్వరరావు సహకరించారని రైతులు ఆరోపిస్తున్నారు. అర్హులకు పరిహారం ఇవ్వకుండా, భూములు లేని వారిని లబ్ధిదారులుగా చూపి రూ.లక్షల్లో దోచేశారని మండిపడ్డారు. దీనిపై సీఎం చంద్రబాబుకు రిజిస్టర్ పోస్టులో ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని మంగళవారం రైతు అశోక్‌కుమార్, తదితర రైతులు తెలిపారు.

తోట్లవల్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గతేడాది సెప్టెంబరు మొదటి వారంలో సంభవించిన కృష్ణానది వరదలకు లంకల్లో వంద శాతం పంటలు దెబ్బతిన్నాయి. వీటిల్లో అధికంగా ఉద్యాన పంటలు ఉన్నాయి. చందు జోసఫ్ సుందరం తోట్లవల్లూరు, కంకిపాడు, పెనమలూరు మండలాలకు ఉద్యానాధికారిగా ఉన్నారు. ఈయన జూలై 20 నుంచి సెప్టెంబర్ 19 వరకు చేతి గాయం కారణంగా సెలవుపై ఉన్నారు. సుందరం స్థానంలో ఉయ్యూరుకు చెందిన ఉద్యానాధికారి నాగదేవిని ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరావు అన్నీతానై వ్యవహరించి చక్రం తిప్పారని రైతులు ఆరోపిస్తున్నారు. తోట్లవల్లూరు మండలంలో పంటల నష్ట పరిహారం ఫలహారం కావడంలో సూత్రధారిగా మండల మిగతా 6లో..

1600

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

ఈ ఏడాది రికార్డు స్థాయిలో ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయం

పండగ వేళ ప్రయాణికుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. పండగకు ముందు, తర్వాత 1,600 ప్రత్యేక సర్వీసులు నడపడానికి సిద్ధమైంది. వీటిలో 1,370 బస్సులను రిజర్వేషన్ ప్రాతిపదికన, మరో 230 సర్వీసులను ప్రయాణికుల రద్దీ, డిమాండ్ ఆధారంగా అప్పటికప్పుడు నడిపేలా ప్లాన్ చేసింది. హైదరాబాద్, రాజమండ్రి, విశాఖపట్నం, రాయలసీమ, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించనుంది.



- 1,370 సర్వీసులకు రిజర్వేషన్ అవకాశం
- రిజర్వులో మరో 230 స్పెషల్ బస్సులు
- పండగకు వచ్చే వారికి 780, తిరుగు ప్రయాణాలకు 590 సర్వీసులు
- హైదరాబాద్, రాజమండ్రి, విశాఖపట్నం, రాయలసీమ, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు
- సంక్రాంతి స్పెషల్ బస్సుల షెడ్యూల్ విడుదల చేసిన ఆర్టీసీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): సంక్రాంతి పండగకు ఆర్టీసీ భారీగా స్పెషల్ బస్సులను నడపనుంది. ఈ సారి సెలవులు పది రోజుల పాటు ఉండటంతో సొంతూళ్లకు వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందన్న ఉద్దేశంతో గతంలో ఎప్పుడూ లేని విధంగా 1600 స్పెషల్ బస్సులను నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. సంక్రాంతి స్పెషల్ బస్సుల షెడ్యూల్‌ను మంగళవారం అధికారికంగా విడుదల చేసింది. వీటిలో 1,370 బస్సులు రిజర్వేషన్ ప్రాతిపదికన నడిపేలా ప్లాన్ చేసింది. మరో 230 బస్సులను అప్పటికప్పుడు వచ్చే రద్దీ (ఆన్ డిమాండ్ రష్)కి అనుగుణంగా నడిపేందుకు వీలుగా రిజర్వులో ఉంచాలని నిర్ణయించింది. గతేడాది సంక్రాంతికి హైదరాబాద్ నుంచి భారీగా ప్రయాణికులు మిగతా 6లో..

రాజమండ్రి, వైజాగ్‌కు స్పెషల్ బస్సులు

పండగకు ముందు హైదరాబాద్ తర్వాత రాజమండ్రికి 13వ తేదీ వరకు 235 స్పెషల్ బస్సులు నడపాలని నిర్ణయించింది. తిరుగు ప్రయాణాలకు మాత్రం స్పెషల్ బస్సులు నడపడం లేదు. విశాఖపట్నం రూట్‌లో పండగకు ముందు 80 స్పెషల్ బస్సులు, పండగ తర్వాత 42 స్పెషల్స్ చొప్పున మొత్తం 122 బస్సులను నడపాలని నిర్ణయం తీసుకుంది. బెంగళూరుకు పండగకు ముందు 14 బస్సులు, పండగ తర్వాత రద్దీ నిమిత్తం 23 బస్సులు చొప్పున మొత్తంగా 37 స్పెషల్ బస్సులను నడపాలని నిర్ణయించింది. చెన్నైకు పండగకు ముందు 13, పండగ తర్వాత 14 బస్సులు వెరసి 27 స్పెషల్స్ నడపనుంది. రాయలసీమ జిల్లాలకు పండగకు ముందు 142, పండగ తర్వాత 186 చొప్పున మొత్తం 328 స్పెషల్ బస్సులను నడపాలని నిర్ణయించింది. హైదరాబాద్, చెన్నై, బెంగళూరుల నుంచి వచ్చే ప్రయాణికులంతా విజయవాడకు వచ్చి ఇక్కడి నుంచి రాజమండ్రి తదితర ప్రాంతాలకు వెళుతుంటారు. అలాగే విజయవాడలో పీఎన్‌బీఎస్‌కు వచ్చే ప్రయాణికులు పెద్ద సంఖ్యలో ఎటు వెళతారన్నది ఆ సందర్భంలో కానీ తెలియదు. అందుకే వారి కోసం రిజర్వుడుగా 230 స్పెషల్ బస్సులను ఉంచాలని నిర్ణయించింది.

బ్యాంకు లోన్లు.. ఇంటి అవసరాలకు..



మచిలీపట్నం సబ్‌జైలు నుంచి బియ్యం మాయం కేసులో నిందితులను కస్టడీలోకి తీసుకుంటున్న పోలీసులు

బియ్యం మాయం కేసులో నగదు వాడుకున్నట్టు చెప్పిన మేనేజర్ మానస్‌తేజ

- పోలీస్ కస్టడీకి బియ్యం కేసు నిందితులు
- గోడౌన్ మేనేజర్, మిల్లు యజమాని, లారీ డ్రైవర్‌ను విచారించిన పోలీసులు
- ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విచారణ
- నేడు జిల్లా కోర్టులో పైముగ్గురు నిందితుల బెయిల్ పిటిషన్లపై విచారణ

మచిలీపట్నం, జనవరి7 (ఆంధ్రజ్యోతి): మాయమైన బియ్యం విక్రయించగా వచ్చిన నగదును బ్యాంకు లోన్ల చెల్లింపునకు, ఇంటి అవసరాలకు వాడినట్టు గోడౌన్ మేనేజర్ మానస్ తేజ్ పోలీసు విచారణలో చెప్పినట్టు తెలుస్తోంది. మాజీ మంత్రి పేర్ని నాని గోడౌన్ నుంచి బియ్యం మాయం కేసులో రిమాండ్‌లో ఉన్న ముగ్గురు నిందితులను పోలీసులు బుధవారం కస్టడీలోకి తీసుకుని ఏడు గంటలపాటు విచారించారు. ఉదయం 10 గంటలకు సబ్‌జైలు నుంచి వారిని ప్రత్యేక వాహనంలో మచిలీపట్నం తాలూకా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గోడౌన్ మేనేజర్ మానస్‌తేజ, మిల్లుయజమాని బొర్రా బాల ఆంజనేయులు, లారీ డ్రైవర్ మిగతా 6లో..

మేనేజర్, లారీ డ్రైవర్‌లను బలి పశువులను చేసేలా...

మాజీ మంత్రి పేర్ని నాని గోడౌన్‌ల నుంచి బియ్యం మాయం కేసులో కీలకపాత్రధారులను తప్పించేందుకు కొత్త కథనాలు తెరపైకి వస్తున్నాయి. గోడౌన్ మేనేజర్, లారీ డ్రైవర్‌లను బలి పశువులను చేసి పేర్ని కుటుంబం బయటపడేలా వ్యూహరచన జరుగుతున్నట్టు తెలుస్తోంది. గోడౌన్ పేర్ని నాని భార్య జయసుధ పేరున ఉండటంతో బియ్యం మాయం కేసులో ఆమెను ఏ1గా చేర్చారు. ఆమెకు ముందస్తు బెయిల్ మంజూరైంది. ఈ కేసులో గోడౌన్ మేనేజర్ మానస్‌తేజను ఏ2గా, పౌర సరఫరాల శాఖ టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్ కోటిరెడ్డిని ఏ3గా, మిల్లు యజమాని బొర్రా బాల ఆంజనేయులును ఏ4గా, లారీడ్రైవర్ బోట్ల మంగారావును ఏ5గా చేర్చారు. గోడౌన్ మేనేజర్ మానస్ తేజ పోలీసులకు చిక్కిన సమయంలో తెలిపిన వివరాల ప్రకారం మాజీ మంత్రి పేర్ని నాని పేరును ఏ6గా చేర్చి ఆయనపైనా కేసు నమోదు చేశారు. బియ్యం రవాణాలో, తూకంలో తేడాలుంటాయని, వాటిని ఎవరూ పట్టించుకోరని, అవకాశం ఉన్నపుడే ఎంతోకొంత సొమ్ము సంపాదించుకోవాలని గోడౌన్ మేనేజర్‌కు బియ్యం మాయం కేసులో నిందితుడిగా ఉన్న లారీడ్రైవర్ సూచించడంతోనే బియ్యంను అధికమొత్తంలో గోడౌన్ మేనేజర్ రవాణా చేయడానికి సహకరించారనే ప్రచారాన్ని వైసీపీ నాయకులు తెరపైకి తెస్తున్నారు. మాజీ మంత్రి పేర్ని నాని భార్య ఈ కేసులో ఏ1గా, ఏ6గా పేర్నినాని ఉండటంతో ఈ కేసులో వారి ఇరువురి ప్రమేయం లేదని చూపేలా తెరవెనుక ఒప్పందం జరిగిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. మానస్ తేజ పేర్ని కుటుంబానికి అత్యంత నమ్మకస్తుడు కావడంతోపాటు, వారివద్దనే ఏళ్లతరబడి పనిచేస్తుండటంతో ఈ కేసులో జైలుశిక్షపడినా అతని కుటుంబ పోషణకు ఇబ్బంది రానీయమని, తమపేర్లు ప్రస్తావించవద్దని తెరవెనుక ఒప్పందం కుదిరినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో గోడౌన్ మేనేజర్‌ను ఈ కేసులో మంగళవారం పోలీసులు విచారణ చేసిన సమయంలో గోడౌన్ యజమానులుగా ఉన్న పేర్ని నాని, ఆయన భార్య పేర్ని జయసుధ పేర్లు ప్రస్తావనకు వచ్చినపుడు సరైన సమాచారం చెప్పకుండా దాటవేత ధోరణితో వ్యవహరించినట్లు తెలుస్తోంది. పేర్ని నాని కుటుంబం ఈ కేసులో నుంచి ఎలాగైనా తప్పించుకునేందుకు తెరవెనుక పలువిధాల ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం.

నాని బెయిల్ పిటిషన్‌పై విచారణ 20కి వాయిదా

బియ్యం మాయం కేసులో ఏ6గా ఉన్న పేర్ని నాని ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 6న ఈ కేసు విచారణకు రాగా మంగళవారానికి వాయిదా పడింది. మంగళవారం ఈ కేసు విచారణను మరలా ఈ నెల 20వ తేదీకి వాయిదా వేస్తూ హైకోర్టు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

డేంజర్ ఇండస్ట్రీస్!

ఎన్టీఆర్ జిల్లాలో 9 ప్రమాదకర పరిశ్రమల గుర్తింపు

- వాటిలో ఆయిల్, విద్యుత్ రంగాలే అధికం
- అన్నీ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలే..
- ప్రమాద రహిత పరిశ్రమల కోసం 'ఆపరేషన్ ఇండస్ట్రీస్' అమలు
- పరిశ్రమల వెంబడి ప్రాంతాల రక్షణకూ చర్యలు



ప్రమాద రహిత పరిశ్రమల కోసం ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం చేపట్టిన 'ఆపరేషన్ ఇండస్ట్రీస్' తొమ్మిది ప్రమాదకర పరిశ్రమలు ఉన్నట్లు గుర్తించింది. అవి కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఆయిల్, విద్యుత్ కంపెనీలుగా నిర్ధారణ అయ్యింది. వీటిలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఆయా పరిశ్రమల్లో ప్రమాదాల సంఖ్యను జీరో స్థాయికి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా మొత్తంగా 1,047 పరిశ్రమలు ఉన్నాయి. కర్మాగారాల శాఖ పరిధిలో ఇవన్నీ రిజిస్టర్ అయి ఉన్నాయి. వీటిలో ప్రభుత్వానికి సంబంధించి 27 పరిశ్రమలు ఉండగా.. ప్రైవేటు రంగానికి చెందినవి 1,020 పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమలలో మొత్తం 44,096 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో పురుషులు 39,800 మంది, మహిళలు 4,293 మంది ఉన్నారు. అమరావతి రాజధాని ప్రాంత పరిధిలో ఎన్టీఆర్ జిల్లా ఉంది. జిల్లాలో మెరుగైన పారిశ్రామిక వాతావరణం కల్పించటానికి నూరుశాతం ప్రమాద రహిత పరిశ్రమలను తీర్చిదిద్దేందుకు వీలుగా జిల్లా యంత్రాంగం 'ఆపరేషన్ ఇండస్ట్రీస్' మిగతా 6లో..

ప్రమాదకరమైన పరిశ్రమలు ఇవే..

జి.కొండూరులోని గెయిల్ ఇండియా లిమిటెడ్ (బూస్టర్ స్టేషన్), హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్ - ఆయిల్ డివిజన్), ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లిలోని హెచ్‌పీసీఎల్ (గ్యాస్ డివిజన్), జి.కొండూరు మండలం కట్టుబడిపాలెంలోని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్ - ఆయిల్ డివిజన్), ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్ - టెర్మినల్), కొండపల్లిలోని ఐఓసీఎల్ - ఎల్‌పీజీ, నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్‌టీటీపీఎస్), ల్యాంకో కొండపల్లి పవర్ ప్లాంట్ లిమిటెడ్ (గ్యాస్ ఆధారితం) పరిశ్రమలను ప్రమాదకర పరిశ్రమలుగా కర్మాగారాల శాఖ గుర్తించింది. ఈ మేరకు కలెక్టర్ లక్ష్మీశకు అధికారులు నివేదికను సమర్పించారు.



విజ్ఞాన దీపికలు

సందడిగా విజయవాడ పుస్తక మహోత్సవం 6లో

ఉమ్మడి జిల్లాకు కొత్తగా 23 మద్యం షాపులు

- ఇప్పటికే రెండు జిల్లాల్లో 236 మద్యం దుకాణాలు
- త్వరలో విడుదల కానున్న నోటిఫికేషన్

6లో

పోరంకిలో రాష్ట్ర స్థాయి సైన్స్ ఎక్స్‌పో ప్రారంభం

8లో

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్ బియ్యం)సేకరణలో తీవ్ర గందరగోళం నెలకొంది. టార్గెట్‌లు పూర్తయ్యాయని కొందరు మిల్లర్లు ధాన్యం కొనుగోలును నిలిపివేయగా, మరికొందరు మిల్లర్లు ధాన్యం సకాలంలో ఇవ్వకపోవడంతో బియ్యం ఆడేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో 10వ తేదీలోపు ప్రభుత్వ గోడౌన్‌లకు బియ్యం చేరాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఆఘమేఘాలపై గోడౌన్‌లకు లోడుతో లారీలను పంపిస్తే అన్‌లోడ్ చేయడంలేదు. రోజుల తరబడి లారీలు అక్కడే నిలిచిపోవడంతో వెయిటింగ్ చార్జీల భారం మిల్లర్లపై పడుతోంది. లారీలు తిరిగి రాక, మిల్లుల్లో పనిలేక వలస కూలీలు వెనక్కి తిరిగి వెళ్లిపోతున్నారు. దీంతో ఏం చేయాలో అర్థంకాక మిల్లర్లు తలలు పట్టుకుంటున్నారు.



మచిలీపట్నం ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద నిలిచిన లారీలు

పరేషాన్

10వ తేదీలోపు గోడౌన్‌లకు బియ్యం చేరాలని అధికారుల ఆదేశం

- గోడౌన్‌ల వద్ద అన్‌లోడ్ చేయకపోవడంతో నిలిచిపోతున్న లారీలు
- మిల్లర్లపై లారీల వెయిటింగ్ చార్జీల భారం
- మిల్లుల వద్ద పనుల్లేక వెనక్కి వెళ్లిపోతున్న బిహార్, ఒడిశా కూలీలు
- అటు లారీలు రాక, ఇటు కూలీలు లేక తలపట్టుకుంటున్న మిల్లర్లు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో ఇప్పటి వరకు 3.25 లక్షల టన్నుల ధాన్యం రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈ ధాన్యం మిల్లర్లకు ఇచ్చి మరపట్టి సీఎంఆర్ బియ్యంగా మార్పు చేసి గుడివాడ, మచిలీపట్నంలోని ఎఫ్‌సీఐ, ఎస్‌డబ్ల్యూసీ గోడౌన్‌లకు తరలించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల కాలంలో ప్రైవేట్ గోడౌన్‌లలో ఉంచిన బియ్యం మాయంపై కేసులు నమోదు కావడంతో బియ్యం త్వరితగతిన గోడౌన్లకు తరలించాలని రాష్ట్ర, జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారులు గత రెండు మూడు రోజులుగా మిల్లర్లకు ఫోన్ ద్వారా సమాచారం పంపుతున్నారు.

గోడౌన్‌ల వద్ద బియ్యం దిగుమతుల్లో జాప్యం

అధికారుల సూచనల మేరకు జిల్లాలోని మిల్లర్లు గుడివాడ, మచిలీపట్నంలోని ప్రభుత్వ గోడౌన్‌లకు బియ్యం పంపుతున్నారు. అయితే అక్కడ లారీల నుంచి బియ్యం సకాలంలో దిగుమతి చేసుకోవడంలేదు. రోజులతరబడి లారీలు గోడౌన్‌ల వద్దనే నిలిచిపోతున్నాయి. గుడివాడ, మచిలీపట్నంలోని గోడౌన్‌ల వద్ద వందేసి చొప్పున లారీలు గత మూడు, నాలుగు రోజులుగా ఉండిపోయాయి. బియ్యం లోడుతో వెళ్లిన ఒక్కోలారీకి కిరాయి కాకుండా రోజుకు కనీసంగా రూ.2,500 వెయిటింగ్ చార్జీల రూపంలో నాలుగు రోజులకు మరో రూ.10 వేలు చెల్లించాల్సి వస్తోందని మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వెయిటింగ్ చార్జీలు అదనపు భారమేనని చెబుతున్నారు. ఈ ఏడాది ప్రభుత్వ గోడౌన్‌లకు సీఎంఆర్ బియ్యం ఇవ్వాలని ఆలస్యంగా అనుమతులు ఇచ్చారని, గత రెండున్నర మిగతా 6లో..

వేధిస్తున్న కూలీల కొరత

జిల్లాలో 147 మిల్లులు ఉన్నాయి. వీటిలో మన ప్రాంతానికి చెందిన కూలీలు ఎవ్వరూ పనిచేయడంలేదు. దీంతో మిల్లు యజమానులు బిహార్, ఒడిశా రాష్ట్రాల నుంచి కూలీలను రప్పించి పనులు చేయించుకుంటున్నారు. మిల్లుల నుంచి బియ్యం లోడుతో వెళ్లిన లారీలు సకాలంలో వెనుదిరిగి రాకపోవడంతో మిల్లుల్లో పనిచేసే కూలీలకు పనిలేకుండా పోతోంది. దీంతో కూలీలు వెనక్కి వెళ్లిపోతున్నారు. ఈ నేపథ్యంలో 10వ తేదీలోగా బియ్యం ప్రభుత్వ గోడౌన్‌లకు పంపలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వం గోడౌన్‌ల వద్ద రోజుకు పది లారీలకు మించి దిగుమతి చేయడం లేదని, దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అధికారులు ఈ అంశంపై దృష్టి సారించాలని మిల్లర్లు కోరుతున్నారు.

ముగిసిన జోన్-2 ఆటల పోటీలు

- ఓవరాల్ చాంపియన్లుగా రాజమండ్రి, కాకినాడ

6లో

తాగి విధులకు వస్తున్నాడు

- వైద్యుడిపై కలెక్టర్‌కు పెనమలూరు గ్రామస్థుల ఫిర్యాదు

8లో

అర్ధరాత్రి తమ్ముళ్ల కుమ్ములాట

- ముస్తాబాదలో అక్రమంగా మట్టి తరలిస్తున్నారని లారీల అడ్డగింపు
- తన్నుకున్న ఇరు వర్గాల టీడీపీ నేతలు

8లో



బైరాగిని యుతవ చదవాలి..
- యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

విజయవాడ కల్చరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : యువత తప్పనిసరిగా బైరాగి కవిత్వాన్ని చదవాలని, ఆయన కవిత్వాన్ని పునఃముద్రణ చేసి యువతకు అందించాల్సిన అవసరం ఉందని సాహితీవేత్త యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పేర్కొన్నారు. కవి ఆలూరి బైరాగి శతజయంతి సభలో యార్లగడ్డ మాట్లాడారు. కవిత్వాన్నే జీవన శ్వాసగా గౌరవించిన బైరాగి, తన ప్రత్యేక వ్యక్తీకరణ, పదవిన్యాసంతో చిక్కని మానవత్వ భావాలు, సామాజిక స్పృహతో తెలుగు సాహిత్య ప్రపంచంలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను అప్పట్లోనే తన కవిత్వంలో ప్రస్తావించారని తెలిపారు. తెలుగు సాహిత్యంలో తనదైన ముద్రవేసిన బైరాగి జీవిత కాలంలో ప్రజల అపార్థానికి గురైనప్పటికీ, సాహిత్య ప్రేమికుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయనను నిరాశావాది, అరాచకవాది అని చిత్రీకరించడం తప్పుడు అభిప్రాయమన్నారు.



రచయిత బండ్ల మాధవరావు, సాహితీవేత్త గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ, బైరాగి పాఠకుల హృదయాల్లో నిలిచిపోయే పదచిత్రాల సృష్టికర్త అన్నారు. బాలల పత్రిక చందమామ హిందీ సంచికకు కొంత కాలం సంపాదకత్వం వహించిన ఆయన, పిల్లల పత్రికల్లో సులువైన భాషలో రచనలు చేశారన్నారు. జీవితాంతం కవిత్వమే ప్రధాన వ్యాపకంగా కొనసాగారన్నారు. బైరాగి మరణానంతరం ఆయన కవిత్వ సంకలనం ఆగమగీతికు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

పదోతరగతి పాఠశాల

విజయవాడ సిటీలైఫ్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : పుస్తకాల్లో అనేక పాఠ్యాంశాలు ఉంటాయి. వాటికి సంబంధించి ప్రశ్నలు, జవాబులకు పెద్ద నోట్స్ రాయాలి. వాటిలో అత్యంత ముఖ్యమైన.. పరీక్షల్లో తరచుగా వచ్చే ప్రశ్నలు, జవాబులకు విద్యార్థులకు అందజేస్తుంది 'పాఠశాల'. పదో తరగతి విద్యార్థుల కోసం విజయవాణి ప్రింటర్స్ ఈ 'పాఠశాల' పుస్తకాన్ని తీసుకొచ్చింది. ప్రతినెల ఈ పుస్తకాన్ని ముద్రిస్తుంది. మొత్తం అన్ని పాఠ్యంశాలకు సంబంధించి ప్రశ్నలు, జవాబులు ఇందులో ఉంటాయి. దీని సంవత్సర చందా రూ.600లుగా ఉంటే పుస్తక మహోత్సవంలో రూ.500లకే అందజేస్తున్నారు. స్టాల్ నంబర్ 31, 32లో ఈ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.




పాఠశాలే గ్రంథాలయం..

అందుబాటులో 3 వేల పుస్తకాలు : సీతారెడ్డి, ఉపాధ్యాయుడు

పటమటలోని కేసీబీ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నా. విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంచేందుకు పాఠశాలలో ప్రత్యేకంగా ఒక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశాం. ఇందులో 3వేల పుస్తకాలున్నాయి. బాలసాహిత్యం, మహనీయుల జీవిత చరిత్రలకు సంబంధించిన పుస్తకాలున్నాయి. ప్రతి రోజుకు ఒక పిరియడ్ పుస్తక పఠనం కోసం కేటాయిస్తున్నాం. 45 మంది విద్యార్థులు కూర్చుని చదివేలా సదుపాయాలున్నాయి.

ప్రత్యేక ఆకర్షణగా 'చైనా' ముద్రణలు

సాధారణంగా పుస్తకాలు తెలుగు రాష్ట్రాల్లో ప్రచురితమవుతాయి. ఇది కాకపోతే పొరుగు రాష్ట్రాల్లో ముద్రణవుతాయి. ఈ దేశంలో కాకుండా చైనాలో ముద్రణ అయిన పుస్తకాలు పుస్తక మహోత్సవంలో ప్రత్యేకార్షణగా నిలిచాయి.



స్పేస్, వరల్డ్ హిస్టరీ, అవర్ ప్లానెట్ ఎర్త్, పంచతంత్ర, 365 అమేజింగ్ యానిమల్స్, మహాభారత, హిస్టరీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పుస్తకాలు చైనాలో ప్రచురితమయ్యాయి. ఈ పుస్తకాలు స్టాల్ నంబరు 52లో ఉన్న విశాలాంధ్ర బుక్ హౌస్‌లో కొలువుదీరాయి.

ప్రజా సమస్యలే నాజర్ కళారూపాలు

- కె.శ్రీనివాస్, 'ఆంధ్రజ్యోతి' మాజీ సంపాదకులు



విజయవాడ కల్చరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలనే కళారూపాలుగా మార్చి ఆదరణ పొందే అవకాశం ఉండటం కారణంగానే ఆదర్శవాది నాజర్ కళాకారుడిగా మారాడని 'ఆంధ్రజ్యోతి' మాజీ సంపాదకులు కె.శ్రీనివాస్ అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో మంగళవారం రామోజీరావు సాహిత్యవేదికపై బుర్రకథ కళాకారుడు షేక్ నాజర్ శతజయంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానవక్తగా శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆ రోజుల్లో ప్రజలను ప్రభావితం చేసి, వారి గుండెల్లో నిలిచిపోయినవారే సెలబ్రిటీలుగా ఉండేవారన్నారు. అలాంటి వారిని నేడు విస్మరించటం దురదృష్టకరమన్నారు. వివిధ పాత్రల ద్వారా పీడితతాడితుల ఆర్తిని, ఆవేదనను, ఆవేశాన్ని సులువుగా ప్రేక్షకులకు అందించడం నాజర్ ఘనత అని వివరించారు. ప్రముఖ విమర్శకుడు గుంటూరు లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ, తెలుగులో బుర్రకథకు ఒక ప్రామాణిక రూపం కల్పించి, పండిత పామరులకు ఆమోదయోగ్యంగా, ఆస్వాదనీయంగా తీర్చిదిద్దిన ఘనత షేక్ నాజర్‌దేనన్నారు. నాజర్‌ను కేవలం బుర్రకథ పితామహుడిగా గుర్తుపెట్టుకుంటే ఆయన కృషికి అన్యాయం చేసినట్టేనన్నారు. తెలుగులో ప్రజా పాటకు, అభ్యుదయ గీతాలకు మూలపురుషుడన్నారు. సుద్దాల హనుమంతుతో సమకాలీనుడుగా ఉంటూ నాజర్ ఆ తర్వాతి వారైన గద్దర్, వంగపండు, పాణిగ్రాహి తదితర ప్రజాకళాకారులకు గురుతుల్యుడయ్యాయని వివరించారు. తాడిత పీడిత ప్రజల బాధలని వాళ్ల నుడికారంలోనే ప్రతిధ్వనింప చేసి, అలాంటి రచనలన్నిటికీ ఆదర్శవంతమైన నమూనాలను అందించాడన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఖాదర్ మొహియుద్దీన్ మాట్లాడుతూ, బిచ్చమెత్తి సంగీత విద్య నేర్చుకున్న నాజర్ తర్వాతి కాలంలో బుర్రకథలో ఆనాటి కళాకారులందరి హృదయాలను గెలుచుకున్నారన్నారు. సంగీత దర్శకుడు చక్రవర్తి, నటి జమున నాజర్ శిష్యులేనన్నారు. సినీవిమర్శకుడు రంగావఝల భరద్వాజ మాట్లాడుతూ, ఒకే వ్యక్తి అన్ని పాత్రలనీ, అన్ని రసాలనూ పోషిస్తూ, మూడు గంటల సేపు శ్రోతలను అలరించే కళారూపం బుర్రకథ అని వివరించారు. ఇంత అద్భుతమైన ప్రక్రియను పూర్తిస్థాయి ప్రజాకళగా మార్చి చిరస్థాయి కలిగించిన వ్యక్తి నాజర్ అన్నారు. నాజర్ కుమారుడు బాషూజీ మాట్లాడుతూ, కేవలం ఒకే బాణీతో నడిచే పూర్వజానపద కళారూపాలకు శాస్త్రీయ సంగీత స్వభావాన్ని అద్ది, సందర్భానికి తగ్గట్టు నడకను మార్చి ఆ కళారూపానికి ఔన్నత్యం తెచ్చారన్నారు. పండితపామరులిద్దరినీ ఆకర్షించేలా, శాస్త్రీయ, జానపద బాణీలను మేళవించడం నాజర్‌కే సాధ్యమన్నారు. సాహితీ స్రవంతి బాధ్యులు వీర ప్రసాద్ తదితరులు సభలో పాల్గొన్నారు.

ప్రమాదంలో రాజ్యాంగ విలువలు

- కేరళ మాజీ విద్యాశాఖామంత్రి ఎంఏ బేబి

విజయవాడ కల్చరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : నేడు కొందరు సాంప్రదాయవాదుల కారణంగా భారత రాజ్యాంగం, దానిలో పొందుపరిచిన మౌలిక విలువలూ ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయని కేరళ మాజీ విద్యాశాఖా మంత్రి ఎం.ఎ.బేబి అన్నారు. మంగళవారం జస్టిస్ హెచ్.ఎస్. నాగమోహనదాస్ రచించిన రాజ్యాంగం మనకేమిచ్చింది? పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. నాగమోహనదాస్ రచనలో రాజ్యాంగంలో పొందుపరచబడిన ప్రజాస్వామ్యం, లౌకికవాదం, గణతంత్రం తదితర విలువలను ప్రస్తావిస్తూ, వాటికి నేడు ఎదురవుతున్న సవాళ్లను నేరుగా వర్ణించారన్నారు. కొందరు సాంప్రదాయ విలువల పేరుతో రాజ్యాంగంలోని మౌలికలను ప్రశ్నించడం దురదృష్టకరమన్నారు. స్వాతంత్ర్యపోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్న అనేకానేక మేధావులు ఎన్నో చర్చలు, సమావేశాల అనంతరం ఆమోదించిన రాజ్యాంగాన్ని ప్రశ్నించడం మనుస్మృతి కోణంలో ప్రశ్నించడం దారుణమన్నారు. నేడు న్యాయవ్యవస్థతో సహా అన్ని వ్యవస్థలూ సాంప్రదాయ భావాలతో ప్రభావితం కావడం ప్రమాదకరమన్నారు. దేశంలో ఏ నిర్ణయానికైనా రాజ్యాంగమూ, దాని మౌలికవిలువలే మూలాధారం కావాలన్నారు.



'రాజ్యాంగం మనకేమిచ్చింది' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఏ బేబి తదితరులు

డేంజర్ ఇండస్ట్రీస్!

(5వ పేజీ తరువాయి)

కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. జిల్లాలో పారిశ్రామిక ప్రమాదాలు పెరిగిపోతున్న నేపథ్యంలో వాటిని తిరిగి జీరో స్థాయికి తీసుకు వచ్చేందుకు వీలుగా జిల్లా యంత్రాంగం అడుగులు వేస్తోంది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ప్రత్యేకంగా చొరవ చూపి ఇండస్ట్రీ సేఫ్టీ ఆడిట్‌ను చేయిస్తున్నారు. జిల్లాలో ప్రమాదకర పరిశ్రమలపై అధ్యయనం చేయించారు. పరిశ్రమలు పెట్టడం సురక్షితమనే వాతావరణాన్ని తీసుకువచ్చేందుకు వీలుగా కర్మాగారాల శాఖను మేలుకొలిపే ప్రయత్నం చేశారు. దీంతో ప్రమాదకర పరిశ్రమలు తీసుకోవాల్సిన చర్యలపై పెద్ద కసరత్తే నిర్వహిస్తున్నారు.

భద్రతా చర్యలపై అవగాహన

కర్మాగారాల శాఖ సమర్పించిన నివేదిక ప్రకారం కలెక్టర్ లక్ష్మీశ వీటికి సంబంధించి సమీప ప్రాంతాల మ్యాపింగ్‌కు ఆదేశించారు. పైన పేర్కొన్న పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగితే వాటి పరిధి ఎంత మేర ఉంటుంది ? ప్రమాదాలు జరిగినపుడు ఏం చేయాలి ? రిస్క్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌ను ఏ విధంగా అమలు చేయాలి ? వంటి వాటిపై దృష్టి సారించాల్సిన అంశాల గురించి ప్రధానంగా కలెక్టర్ ఇప్పటికే కర్మాగారాల శాఖతో పాటు రెవెన్యూ యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. గుర్తించిన ప్రమాదకరమైన భారీ పరిశ్రమలలో అర్హత కలిగి నైపుణ్యం ఉన్న వారికి ఉద్యోగాలు కల్పించటం, ప్రమాదాలకు సంబంధించి సన్నద్ధతపై సిబ్బందికి అవగాహన కోసం తరచూ మాక్ డ్రిల్స్ నిర్వహించటం, ప్రమాదాలకు ఆస్కారమిచ్చేలా లీకేజీలు ఏవైనా ఉంటే వాటిని గుర్తించటం వంటి వాటిని సీరియస్‌గా అమలు చేయాలని చెప్పారు. 2023లో ఒక్క ప్రమాదం జరిగితే.. 2024లో ఏకంగా నాలుగు ప్రమాదాలు జరిగాయి. భవిష్యత్తులో ఈ సంఖ్య పెరగకుండా.. మళ్లీ జీరో స్థితికి తీసుకువచ్చేందుకు వీలుగా 'ఆపరేషన్ ఇండస్ట్రీస్' కార్యక్రమాన్ని నిర్వహించాలని భావిస్తున్నారు.

సూత్రధారి ఏవోనే!

(5వ పేజీ తరువాయి)

వ్యవసాయాధికారి జి.నాగేశ్వరరావు ఉన్నారని, అగ్రికల్చర్ అసిస్టెంట్ మౌనిక, వీఆర్వో బి.నాగేశ్వరరావు పాత్ర కూడా ఇందులో ఉందని రైతులు సీఎం నారా చంద్రబాబు నాయుడుకి రిజిస్టర్ పోస్టులో ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని మంగళవారం రైతు అశోక్‌కుమార్, తదితర రైతులు తెలిపారు.

అంతా కలిసే చేశారు..

సైట్ లాగిన్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌ల చేతుల్లో ఉన్నా వారు ఏవోకి తెలియకుండా బోగస్‌పేర్లను వరద బాధిత రైతుల కింద ఎంటర్ చేసే సాహసం చేయరని పలువురు రైతులు అంటున్నారు. ఏవో నాగేశ్వరరావు అక్రమార్కుల పేర్లు ఎంటర్ చేయించడంతో పలు గ్రామాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్లు కూడా తమకు నచ్చినవారి పేర్లు ఎంటర్ చేసి పంటల నష్టపరిహారాన్ని పక్కదారి పట్టించారని చెబుతున్నారు. తోట్లవల్లూరులో శివ కాంతమ్మ ఆగ్రో ఏజెన్సీస్ యజమాని దండి భాస్కరరావు, ఆయన భార్య, కోడలు అక్రమంగా పంటల నష్టపరిహారం పొందిన విషయం ఆధారాలతో బయట పడింది. భాస్కరరావుని విలేకరులు వివరణ అడిగితే ఏవో నాగేశ్వరరావుకు అంతా తెలుసని, ఆయన ద్వారానే తమకు పంట నష్టపరిహారం డబ్బులు వచ్చాయని స్పష్టం చేశారు. ఏవో నాగేశ్వరరావు సూత్రధారి అనే ఆరోపణలకు భాస్కరరావు ఉదంతమే సాక్ష్యంగా నిలుస్తోందని రైతులు చెబుతున్నారు. ఇంకా మండలంలోని ప్రైవేటు ఎరువులు, పురుగు మందుల దుకాణాల యజమానుల ఆధార్‌నంబర్లను అధికారులు సేకరించి తనిఖీ చేస్తే మరిన్ని అక్రమాలు బయటకు వచ్చే అవకాశం ఉందంటున్నారు.

పరేషన్

(5వ పేజీ తరువాయి)

నెలలుగా మరపట్టిన బియ్యం గోడౌన్‌కు పంపినా, లారీలు త్వరితగతిన వెనక్కు రాకపోవడంతో ఇబ్బందుల పాలవుతున్నామని మిల్లర్లు పేర్కొంటున్నారు. ఇంతలోనే ఈ నెల 10వ తేదీలోగా పూర్తిస్థాయిలో బియ్యం గోడౌన్‌లకు తరలించాలని, లేకుంటే సదరు మిల్లులపై చర్యలు తీసుకుంటామని అధికారులు సందేశాలు పంపుతున్నారని మిల్లర్లు వాపోతున్నారు.

ముగిసిన జోన్-2 ఆటల పోటీలు

» ఓవరాల్ చాంపియన్లు రాజమండ్రి, కాకినాడ



బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ వీర రవి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వేణు

మోపిదేవి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవిలోని బీసీ బాలుర గురుకుల పాఠశాలలో జరుగుతున్న జోన్-2 ఆటల పోటీలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి. ఉమ్మడి కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల నుంచి 19 జట్లు తలపడ్డాయి. బాలుర విభాగంలో వాలీబాల్ అనపర్తి పాఠశాల ప్రథమ స్థానం, కొవ్వూరు ద్వితీయ స్థానంలో నిలిచాయి. కబడ్డీలో కాకినాడ ప్రథమ స్థానం, తాడేపల్లి గూడెం రెండో స్థానం సాధించాయి. ఖో-ఖోలో అమలాపురం ప్రథమ స్థానం, మోపిదేవి ద్వితీయ స్థానంలో నిలిచాయి. హ్యాండ్ బాల్ పోటీల్లో అనపర్తి ప్రథమ స్థానం, కాకినాడ ద్వితీయ స్థానం సాధించాయి. షటిల్‌లో తుని ప్రథమ స్థానం, మోపిదేవి ద్వితీయ స్థానం సాధించాయి. టెన్నికాయిట్‌లో కాకినాడ ప్రథమ స్థానం, అమలాపురం ద్వితీయ స్థానం సాధించాయి. చెస్‌లో కొవ్వూరు ప్రథమ స్థానం, తాడేపల్లి గూడెం ద్వితీయ స్థానంలో నిలువగా, క్యారమ్స్‌లో మోపిదేవి ప్రథమ స్థానం, కాకినాడ ద్వితీయ స్థానం సాధించాయి. బాలుర విభాగంలో కాకినాడ ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించగా, బాలికల విభాగంలో రాజమండ్రి పాఠశాల ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం చేసుకున్నాయి. పోటీల్లో విజేతలైన జట్లకు ప్రిన్సిపాల్ కె.వీరరవి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వేణు బహుమతులు అందజేశారు.

బ్యాంకు లోన్లు.. ఇంటి అవసరాలకు..

(5వ పేజీ తరువాయి)

బోట్ల మంగారావును సాయంత్రం ఐదు గంటల వరకు విచారణ చేసిన పోలీసులు అనంతరం వీరిని కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి పోలీసులు మీపై ఒత్తిడి తెచ్చేలా ప్రవర్తించారా.. మీకేమైనా ఇబ్బంది కలిగిందా అని నిందితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం న్యాయమూర్తి ఆదేశాల మేరకు వీరిని మచిలీపట్నం స్పెషల్ సబ్‌జైలుకు తరలించారు.

బియ్యం మాయంపై లోతుగా విచారణ

బియ్యం మాయం కేసులో కస్టడీకి తీసుకున్న నిందితులను రాబర్ట్‌సన్‌పేట(ఆర్‌పేట) సీఐ ఏసుబాబు, మరికొందరు పోలీస్ అధికారులు ఏడుగంటల పాటు విచారించారు. విచారణ తీరును వీడియో తీశారు. న్యాయవాదుల సమక్షంలో ఈ విచారణ కొనసాగింది. "గోడౌన్ నుంచి బియ్యం తరలించాలని ఎవరు చెప్పారు. ఎప్పుడెప్పుడు, ఎక్కడికి బియ్యం తరలించారు. ఎవరికి విక్రయించారు. కిలోబియ్యం ఎంత ధరకు విక్రయించారు. వచ్చిన సొమ్మును ఎవరి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు." అనే అంశాలపై పోలీసులు నిందితులను ప్రశ్నించినట్లు తెలిసింది. గోడౌన్ యజమాని పేర్ని నాని, ఆయన భార్య పేర్ని జయసుధ బ్యాంకు ఖాతాలకు నగదు జమచేశారా అనేదానిపై లోతుగా విచారించి వివరాలు రాబట్టినట్టు సమాచారం. బియ్యం విక్రయించగా వచ్చిన నగదులో కొంతమేర బ్యాంక్ లోన్‌లు కట్టేందుకు, ఇంటి అవసరాల నిమిత్తం వాడుకున్నట్లు ఈ కేసులో ఏ-2గా ఉన్న గోడౌన్ మేనేజర్ మానస్‌తేజ పోలీసుల విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. కాగా, రిమాండ్‌లో ఉన్న ముగ్గురు నిందితుల బెయిల్ పిటిషన్‌పై విచారణ గురువారం జిల్లా కోర్టులో జరగనుంది. ఈ కేసులో ఏ-3గా ఉన్న పౌరసరఫరాలశాఖ టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్ కోటిరెడ్డికి ఇప్పటికే బెయిల్ మంజూరైంది.

ఉమ్మడి జిల్లాకు కొత్తగా 23 మద్యం షాపులు

» ఇప్పటికే రెండు జిల్లాల్లో 236 మద్యం దుకాణాలు

» త్వరలో విడుదల కానున్న నోటిఫికేషన్

ఎన్టీఆర్‌కు 12, కృష్ణాకు 11



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాల సంఖ్య పెరగనుంది. నూతనంగా మరో 23 షాపులు ఏర్పాటుకానున్నాయి. దీనికి సంబంధించి ప్రకటన త్వరలో వెలువడనుంది. కొత్త దుకాణాలను గీత కార్మికులకు కేటాయించనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెచ్చిన కొత్త మద్యం పాలసీ ప్రకారం ఉమ్మడి కృష్ణా జిల్లాలో 236 దుకాణాలు ఏర్పాటయ్యాయి. ఎన్టీఆర్ జిల్లాలో 113, కృష్ణా జిల్లాలో123 దుకాణాలు ఉన్నాయి. విజయవాడలో మొత్తం 39, మచిలీపట్నంలో ఐదు షాపులు ఏర్పాటయ్యాయి. ఎన్టీఆర్ జిల్లాలో అన్ని మండలాల్లో కలిపి 58, కృష్ణా జిల్లాలో అన్ని మండలాల్లోను కలిపి 98 షాపులు ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో ఎనిమిది ఎక్సైజ్ స్టేషన్లు ఉండగా విజయవాడలో మూడు ఉన్నాయి. విజయవాడ తూర్పు, పశ్చిమ, భవానీపురం స్టేషన్లు ఉన్నాయి. ఇవి కాకుండా జగ్గయ్యపేట, కంచికచర్ల, మైలవరం, నందిగామ, తిరువూరులో ఎక్సైజ్ స్టేషన్లు ఉన్నాయి. కృష్ణా జిల్లాలో మొత్తం ఎనిమిది స్టేషన్లు ఉన్నాయి. మచిలీపట్నం, అవనిగడ్డ, బంటుమిల్లి, గన్నవరం, గుడివాడ, మొవ్వ, నందివాడలో స్టేషన్లు ఉన్నాయి. ప్రభుత్వం ఇప్పటి వరకు కేటాయించిన షాపులు కాకుండా కల్లు గీత కార్మికులకు కొన్ని షాపులను రిజర్వ్ చేస్తామని ప్రకటించింది. దీనిప్రకారం నూతనంగా 23 షాపులు రానున్నాయి. ప్రస్తుతం ఉన్న 236 మద్యం దుకాణాలతో కలిపి మొత్తం 259 దుకాణాలు ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఉంటాయి. కొత్తగా ఏర్పాటయ్యే షాపులకు రెండేళ్ల కాలపరిమితికి లైసెన్స్ ఇస్తారు. కొత్త షాపులకు ఫీజు వివరాలు, ఇతర షరతులు త్వరలో వెలువడనున్నాయి.

● **ఎన్టీఆర్ జిల్లాలో ప్రస్తుతం ఉన్న షాపులు**

విజయవాడ (39), జగ్గయ్యపేట (4), కొండపల్లి (2), నందిగామ (6), తిరువూరు (1) ఉండగా.. మండలాల వారీగా ఎ.కొండూరు (2), చందర్లపాడు (3), జి.కొండూరు (4), గంపలగూడెం (4), ఇబ్రహీంపట్నం (3), జగ్గయ్యపేట రూరల్ (4), కంచికచర్ల (5), మైలవరం (4), నందిగామ రూరల్ (2), పెనుగంచిప్రోలు (5), రెడ్డిగూడెం (2), తిరువూరు రూరల్ (2), వత్సవాయి (2), వీరులపాడు (2), విజయవాడ రూరల్ (10).

● **కృష్ణా జిల్లాలో ప్రస్తుతం ఉన్న షాపులు**

మచిలీపట్నం (5), గుడివాడ (7), పెడన (4), తాడిగడప (3), ఉయ్యూరు (6), మండలాల వారీగా.. అవనిగడ్డ (2), బంటుమిల్లి (3), బాపులపాడు (9), చల్లపల్లి (4), గన్నవరం (9), ఘంటసాల (3), గుడివాడ రూరల్ (2), గుడ్లవల్లేరు (6), గూడూరు (2), కంకిపాడు (7), కోడూరు (3), కృత్తివెన్ను (4), మచిలీపట్నం రూరల్ (3), మోపిదేవి (3), మొవ్వ (4), నాగాయలంక (3), నందివాడ (4), పామర్రు (4), పమిడిముక్కల (3), పెడన రూరల్ (2), పెదపారుపూడి (2), పెనమలూరు (5), తోట్లవల్లూరు (3), ఉంగుటూరు (5), ఉయ్యూరు రూరల్ (3).



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి, పక్కన మాజీ మంత్రి పిన్నమనేని కోటేశ్వరరావు, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తదితరులు

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి

» ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి

గుడివాడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రం అభివృద్ధి బాటపట్టాలంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, కూటమి ప్రభుత్వానికి పట్టభద్రులు మద్దతుగా నిలవాలని కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కోరారు. మంగళవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని జీవీ పూర్ణచంద్రరావు కమ్యూనిటీ హాల్‌లో నియోజకవర్గ పట్టభద్రులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం రాష్ట్రాన్ని సమస్యల గుండంగా మార్చిందని, గాడి తప్పి నిర్వీర్యమైన రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకురావడం కోసం ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ప్రజల నమ్మకాన్ని, విశ్వాసాన్ని వమ్ముచేయకుండా నిరంతరం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కష్టపడుతోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ, ప్రభుత్వానికి మద్దతుగా పట్టభద్రులు విజయాన్ని అందించాలని, రికార్డు మెజార్టీ గుడివాడ నుంచి వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, అధికారంలో ఉన్నా, లేకున్నా ఆలపాటి ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉన్నారని, ప్రజల తరపున అనేక పోరాటాలు చేశారన్నారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఆలపాటిలాంటి సమర్థుడిని శాసనమండలికి పంపాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు మాట్లాడుతూ, ఆలపాటి విజయం నల్లేరుపై నడక అని, అత్యధిక మెజార్టీతో గెలపొందేలా కృషి చేస్తామన్నారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ, ఆలపాటి విజయంలో పార్టీశ్రేణులు భాగస్వామ్యులవుతారని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఎ.ఎస్ రామకృష్ణ, అర్బన్ బ్యాంకు మాజీచైర్మన్ పిన్నమనేని బాబ్జీ, సత్యనారాయణ, దానేటి సన్యాసిరావు, రాంబాబు, మురళీ, మజ్జి శ్రీనివాస్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత భారత్ కోసం కృషి చేద్దాం

» బాలికల విద్య, ఆర్థిక సాధికారతపై ప్రత్యేక దృష్టి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహ రహిత భారత్ కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాల్సిన అవసరముందని, సమష్టి కృషితో బాల్యవివాహాలను అరికట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన బాల్యవివాహ రహిత భారత్ (బాల్యవివాహ ముక్త్ భారత్) ప్రచార కార్యక్రమ అమల్లో భాగంగా బాల్య వివాహాల నిషేధ అధికారుల (సీఎంపీఓ)తో జిల్లాస్థాయి సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాల్య వివాహం ఓ సాంఘిక దురాచారమని, అది బాలికల విద్య, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకం కలిగించడమే కాకుండా వారి కలలను సాకారం చేసుకొనే అవకాశాలను దూరం చేస్తుందని వివరించారు. ప్రతిఒక్కరూ బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ఇందులో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలన్నారు. బాల్య వివాహాలను అడ్డుకొనేందుకు చట్టాల పటిష్ట అమల్లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. బాలికల విద్యతో పాటు సాధికారిత కల్పించడం ద్వారా పేదరికాన్ని తద్వారా బాల్య వివాహాలు వంటి సాంఘిక దురాచారాలను దూరం చేయొచ్చని పేర్కొన్నారు. బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్, బాల్య వివాహ రహిత భారత్ కోసం గళాన్ని వినిపిస్తామని అందరితో కలెక్టర్ లక్ష్మీశ ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో నోడల్ అధికారి సీహెచ్ సాయిగీత, వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ కీర్తి బొల్లినేని, విజయవాడ రూరల్ సీడీపీవో జి.మంగమ్మ, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం.రాజరాజేశ్వరరావు, సీఎంపీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, సీడీపీవోలు, ఎఎస్ఐలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ఆర్టీసీ..

(5వ పేజీ తరువాయి)

తరలివచ్చారు. అప్పట్లో ఆర్టీసీ అధికారులు 1,310 బస్సులను నడిపారు. అయితే డిమాండ్‌కు అనుగుణంగా బస్సులను నడపలేకపోయారు.

పక్కాప్లాన్‌తో ముందుకు..

గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ఆర్టీసీకి 150 (కాలం తీరిపోవడం, స్క్రాప్‌కు పంపించడం) బస్సుల వరకు తగ్గాయి. దీంతో స్పెషల్ బస్సులు నడిపేంత స్థాయిలో ఆర్టీసీ దగ్గర బస్సులు లేకపోవడంతో సమస్య ఏర్పడుతోంది. అయినప్పటికీ గతేడాది కంటే 290 బస్సులను అదనంగానే నడపటానికి ప్లాన్ చేసింది. సంక్రాంతి పండగకు ముందు 780 బస్సులు, పండగ తర్వాత తిరుగు ప్రయాణాల కోసం 590 బస్సులను నడపాలని నిర్ణయం తీసుకుంది. కిందటిసారి హైదరాబాద్ నుంచి భారీగా ట్రాఫిక్ వచ్చింది. తెలంగాణ ఏపీకి చెందిన బస్సులు సరిపోకపోవడంతో ప్రయాణికులు కార్ల మీద పెద్ద సంఖ్యలో వచ్చారు. దీనిని దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్‌కు ఈ సంక్రాంతికి ముందు 296 స్పెషల్ బస్సులను నడపాలని నిర్ణయించింది. జనవరి 9న 45, 10న 70, 11న 70, 12న 70, 13న 23 స్పెషల్ బస్సుల చొప్పున హైదరాబాద్‌కు ఇక్కడి నుంచి పంపించనుంది. సాధారణ షెడ్యూల్ బస్సులు 200 వరకు యథావిధిగా రాకపోకలు సాగిస్తాయి. పండగ తర్వాత తిరుగు ప్రయాణాలను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్‌కు 325 బస్సులను నడపాలని ప్లాన్ చేసింది. జనవరి 14న 12, 15న 58, 16న 81, 17న 38, 18న 27, 19న 78, 20న 31 స్పెషల్ బస్సుల చొప్పున నడపనుంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118,126, 137
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.05

కూటమి ప్రభుత్వం మంచి మనసున్న ప్రభుత్వం

పెనమలూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మంచి మనసున్న ప్రభుత్వమని స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వ్యాఖ్యానించారు. మంగళవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని బాధితులకు పదిలక్షలకు పైగా విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధనకోటేశ్వరరావు, వెలగపూడి శంకరబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్, బీసీ నాయకులు సంగెపు రంగారావు, శొంఠి శివరాంప్రసాద్, పీతా గోపీచంద్, బొంగరాల అబ్రహాం, సుంకర రమేష్ తదితరులు పాల్గొన్నారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్


భగవద్గీత ప్రాముఖ్యతవివరిస్తున్న ప్రొఫెసర్ ఎంబి సువర్చల

భగవద్గీత ప్రాముఖ్యతపై అవగాహన

ఉయ్యూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఏజీఅండ్ఎస్‌జీఎస్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో భగ వద్గీత ప్రాముఖ్యత అనే అంశంపై మంగళవారం నిర్వహించిన సదస్సులో ఏఎస్ఆర్ కళాశాల ప్రొఫెసర్ ఎంబీ సువర్చల మాట్లాడారు. పట్టుదలను పెంపొందిస్తూ ఫలితాల గురించి ఆందోళన చెందకుండా వ్యక్తులు తమ ప్రయత్నాలపై దృష్టిపెట్టాలన్నది గీత సారాంశమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ, అధ్యాపకులు, కిషోర్, రమేశ్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఆక్రమణలు

• జంక్షన్ ప్రధాన రోడ్లలో విచ్చలవిడిగా ఫుట్‌పాత్ ఆక్రమణలు • ఆక్రమణలు తొలగింపునకు రాజకీయ నేతల అడ్డు

హనుమాన్‌జంక్షన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జంక్షన్ ప్రధాన రోడ్లలో ఫుట్‌పాత్, రోడ్డు మార్జిన్ ఆక్రమణలు అడ్డగోలుగా మారుతున్నాయి. రహదారి వెంబడి ఉన్న ఫుట్‌పాత్, రోడ్డు మార్జిన్‌లను వెండర్లు ఆక్రమించి వ్యాపారాలు సాగించడంతో సాధారణ వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. పాదచారులు సైతం తప్పుకోలేని విధంగా ఆక్రమణలకు పాల్పడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. పోలీసులు సైతం చేష్టలుడిగి చూస్తుండడంతో ఆక్రమణలు, వాహనాలు పార్కింగ్‌లు హద్దు మీరుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుడివాడ ,నూజివీడు రోడ్డుల్లో రోడ్డు మార్జిన్ దాటి వాహనాలు పార్కింగ్ చేయడం నిత్యం పరిపాటిగా మారింది. రోడ్డు మార్జిన్, ఫుట్‌పాత్‌ల మీద పండ్లు, పూలు, టీ, ఫాస్ట్‌ఫుడ్ వెండర్లు క్రయ విక్రయాలు నిర్వహించడంతో ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలను నడిరోడ్డు మీద పార్కింగ్ చేస్తున్నారు. రెండు వరుసల రోడ్డులో కనీసం ఒక వరుసలో కూడా వాహనాలు తప్పుకోవడానికి అవకాశం లేకుండా పోతోంది. పాదచారులు సైతం ఇబ్బందిపడుతున్నారు. గత ఏడాది డిసెంబరులో బాపులపాడు గ్రామ పంచాయతీ ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించడానికి పూనుకుంది. విజయవాడ రోడ్డులో, నూజివీడు రోడ్డులో కొంత మేరకు ఫుట్‌పాత్, రోడ్డు మార్జిన్ ఆక్రమణలు తొలగించారు. గుడివాడ రోడ్డులో కూడా తొలగించాలని భావించేలోగా రాజకీయ నాయకులు మోకాళ్లు అడ్డుపెట్టారు. దీంతో ఆక్రమణలు తొలగింపు కార్యక్రమం ఆగిపోయింది. ఆక్రమణలు యథావిధిగా సాగుతున్నాయి. తొలగించిన వాటిని కూడా యథాస్థితిలోకి తెచ్చుకున్నారు. ఫుట్‌పాత్, రోడ్డు మార్జిన్‌లు ఆక్రమణల కారణంగా ట్రాఫిక్ అంతరాయం కలుగుతోందని వాహన చోదకులు అంటున్నారు. పోలీసులు, గ్రామ పంచాయతీ అధికారులు జోక్యం చేసుకొని అడ్డగోలు పార్కింగ్‌లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


గుడివాడరోడ్డులో రాకపోకలకు ఇబ్బంది కలిగించేలాపార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు


క్యాలెండరును ఆవిష్కరిస్తున్న అనుమోలు ప్రభాకరరావు

క్యాలెండర్ ఆవిష్కరణ

పెనమలూరు, జనవరి7(ఆంధ్రజ్యోతి): ప్రజానాట్యమండలి నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం పోరంకిలోని ప్రజానాట్యమండలి వ్యవస్థాపకుడు డాక్టర్ గరికిపాటి రాజారావు విగ్రహం వద్ద ఆవిష్కరించారు. డాక్టర్ రాజారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ప్రజానాట్యమండలి నాయకులు, సీఐటీయూ నాయకులు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అనుమోలు ప్రభాకరరావు, షేక్ ఖాసిం, కొండలబాబు, త్రిమూర్తులు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..

ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ సంఘ నూతన క్యాలెండర్‌ను ఆ సంఘనాయకులు యనమలకుదురు లాకుల సెంటరులో ఆవిష్కరించారు. సంఘనాయకులు ద్రాక్షారపు సూరిబాబు, కేసనకుర్తి ఈశ్వరరావు, ఆకునూరు సుబ్బారావు, నవిరి మహేష్, దాక్షారపు రాము, అయోధ్య సత్యనారాయణ, గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, పీ సత్యనారాయణ, అయోధ్య శ్రీనివాసరావు, తెన్నేటి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

12న ముగ్గుల పోటీలు

కంకిపాడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 12న నిర్వహించనున్న ముగ్గుల పోటీలను విజయవంతం చేయాలని తెలుగు మహిళ జిల్లా నాయకురాలు మేడసాని రత్నకుమారి చెప్పారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆమె మాట్లాడుతూ జనసేన పార్టీ పెనమలూరు నియోజక వర్గ సమన్వయ కర్త ముప్పా రాజా ఆధ్వర్యంలో ఈ నెల 12న ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలిగిన మహిళలు రత్నకుమారి (9392206748), విజయలక్ష్మీ (7780578006), మేకా స్వాతి (6301179414)లను సంప్రదించాలని ఆమె కోరారు.

జోసఫ్‌తంబి జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం

ఉంగుటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : దైవసేవకుడుగా తాను చేసిన ఎన్నో అద్భుతాల ద్వారా బ్రదర్ జోసఫ్ తంబి అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని కోడూరుమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ రెవ.ఫాదర్ పసుపులేటి యుగల్‌కుమార్ కొనియాడారు. బ్రదర్ జోసఫ్ తంబి తిరునాళ్లను పురస్కరించుకుని పెదఅవుటపల్లిలోని తంబి పుణ్యక్షేత్రంలో మంగళవారం నాలుగవరోజు నవదిన ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. తొలుత ఫాదర్ యుగల్‌కుమార్ తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్‌తో కలిసి భక్తులపై పరిశుద్ధాత్మ పవిత్ర జలాన్ని సంప్రోక్షించారు. తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్ మాట్లాడుతూ తంబి జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక విచారణగురువులు రెవ.ఫాదర్ గోపు అభిలాష్, సహాయక గురువులు రెవ.ఫాదర్ గొన్నూరి ఏసుపాదం, కోశాధికారి రెవ.ఫాదర్ దిరిశం జోసఫ్ జయప్రసాద్, ఇతర ఉపదేశులు, కన్యాస్త్రీలు, గుడిపెద్దలు, సంఘస్తులు, మరియదళ సభ్యులు, విశేషసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


దివ్యబలిపూజను సమర్పిస్తున్న ఫాదర్ యుగల్‌కుమార్

సమగ్ర సస్యరక్షణతోనే మేలైన దిగుబడులు

ఉంగుటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మినుము పైరులో రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించటం ద్వారా మేలైన దిగుబడులు సాధించవచ్చునని మచిలీపట్నం జిల్లా వనరుల కేంద్రం(డీఆర్సీ) డీడీఏలు ఎస్‌వైవీఎస్ మనోహర్, జ్యోతిరమణి అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని మానికొండ పొలాలను డీఆర్సీ బృందం సందర్శించింది. సార్వా వరి తర్వాత రబీ పంటగా రైతులు సాగుచేసిన మినుము పైరులో పలుచోట్ల ఎండుతెగులు, కాండం గజ్జి, లద్దెపురుగు అశించడం గమనించారు. పురుగులు, తెగుళ్ల ఉధృతిని బట్టి అవసరమైన మేరకే పురుగుమందులు వాడాలని సూచించారు. ఏడీఏలు ఎం.సునీల్, కె.శ్రీనివాస్, వీపీఏలు వి.మురళీకృష్ణ, భానుప్రియ, ,పాల్గొన్నారు.


రైతులకు సూచనలు ఇస్తున్న మనోహర్, జ్యోతిరమణి

విద్యా సంస్థలకు ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): లయన్స్ మాజీ జిల్లా గవర్నరు వీరమాచనేని రామబ్రహ్మం స్థానిక లయన్స్ క్లబ్‌లో సతీమణి వీరమాచనేని సుశీల జ్ఞాపకార్థం వివిధ పాఠశాలల మౌలిక వసతులు అభివృద్ధికి రూ.15వే లు ఆర్థిక సాయం అందించారు. స్థానిక ఆదిత్య బధిర, ఆశాజ్యోతి దివ్యాంగుల పాఠశాలలకు చెరో రూ.5వేలు, ఉంగుటూరు మండలం పొణుకుమాడు ఎంపీపీ స్కూల్‌కు రూ. 5వేలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నాయకులు నందిగం స్వామి, తమిరి రమేశ్, అక్కినేని రాఘవేంద్రరావు, వీరమాచనేని ఉమామహేశ్వరరావు పాఠశాలల నిర్వాహకులు ఆకుల వెంకటరమణ, మరీదు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందిస్తున్న లయన్స్ క్లబ్ మాజీ గవర్నరు రామబ్రహ్మం

ఉంగుటూరు మాజీ సర్పంచి కన్నుమూత

ఉంగుటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు గ్రామ మాజీ సర్పంచ్ పొట్లూరి దుర్గాప్రసాద్(85) సోమవారం రాత్రి హైదరాబాద్, నిజాంపేట్‌లోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. 1981-86లో గ్రామ సర్పంచ్‌గా గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. తొలుత కాంగ్రెస్‌పార్టీ నాయకుడిగా వున్న దుర్గాప్రసాద్ స్వర్గీయ ఎన్టీఆర్ పిలుపుతో టీడీపీలో చేరి పార్టీ కార్యకలాపాల్లో చురుకైన పాత్ర పోషించారు. ఈయన కుమారుడు పొట్లూరి సీతారామప్రభు, కుమార్తెలు కోగంటి రమాదేవి, తుమ్మల ప్రవీణ వున్నారు. అమెరికాలో వున్న చిన్నకుమార్తె రాగానే ఈనెల 9న ఉదయం 8గంటలకు నిజాంపేట్‌లో అంత్యక్రియలు జరుగుతాయని కుమారుడు సీతారామప్రభు తెలిపారు.



పేకాట శిబిరాలపై దాడి

ఉంగుటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలుగ్రామాల్లో పేకాట స్థావరాలపై మంగళవారం ఉంగుటూరు పోలీసులు మెరుపుదాడులు నిర్వహించారు. మానికొండలో గుట్టుచప్పుడు కాకుండా పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారినుంచి రూ.2100, నాలుగు సెల్‌ఫోన్లు, ఆముదాలపల్లిలో జూదమాడుతున్న ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.1210 స్వాధీనం చేసుకుని ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యు.గోవిందు తెలిపారు.

సెమిస్టర్ ఫలితాల్లో శ్రీజ్యోతి పాలిటెక్నిక్ ఉత్తమ ఫలితాలు

ఉయ్యూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : 2024-2025 విద్యాసంవత్సరంలో ఎస్‌బీటీఈటీ నిర్వహించిన పాలిటెక్నిక్ తృతీయ సంవత్సరం 5వ సెమిస్టర్ పరీక్షలలో కలవపాముల శ్రీజ్యోతి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ జె శివకుమార్ తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో పి. జ్ఞానేశ్వరి, ఎన్ రామ్‌చరణ్, కె. సాహితి, షేక్ మార్నిషా 90శాతంకు పైగా మార్కులు సాధించారు. మిగిలిన బ్రాంచ్‌లలో కూడా రాష్ట్ర స్థాయిలో మంచి ఫలితాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ శివకుమార్, అధ్యాపకులు అభినందించారు.

కాటూరులో ఆవుల అందాల పోటీలు

ఉయ్యూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ పురస్కరించుకుని కాటూరు గ్రామ తెలుగు యువత ఆధ్వర్యంలో ఈనెల 12న ఆవుల అందాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలుగుయువత మండల అధ్యక్షుడు కోడె హరీశ్ తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గోమాతను పూజించడం హిందూ సంప్రదాయంగా వస్తుందన్నారు. పోటీల్లో పాల్గొన్న ఆవులకు ప్రథమ బహుమతిగా రూ.25, 116, ద్వితీయ బహుమతి రూ. 10,116, తృతీయ బహుమతి రూ. 5,11 6 అందచేస్తామని వివరాలకు 8143783253 సెల్ నంబరుకు సంప్రదించాలన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్: స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆరుగొలను గ్రామానికి చెందిన వేటుకూరి వెంకటరమణరాజు, శృతి కుటుంబ సభ్యులు 200 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈవో కె.శ్రీనివాస్ పర్యవేక్షణలో అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు, శ్రీనివాసాచార్యులు తదితర అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

జూదం, కోడి పందేలు వేస్తే చట్టపరంగా చర్యలు


జబర్లపూడిలో పోలీసుల ప్రదర్శన

ఉయ్యూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : జూదక్రీడలు వద్దు సంప్రదాయ క్రీడలు ముద్దు, సంక్రాంతి పండుగకు జూదం, కోడి పందేలు వేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అధికారులు గ్రామాల్లో మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. మండల తహసీల్దార్ ఎం.సురేశ్‌బాబు, రూరల్ ఎస్సై కె సురేశ్‌కుమార్, మండల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జబర్లపూడి, ముదునూరు, బోళ్లపాడు, కాటూరులో ప్రదర్శన నిర్వహించి కోడి పందేలు, జూద క్రీడలకు పాల్పడితే చట్టపరమైన జర్యలు ఉంటాయని ప్రజలకు హెచ్చరికలు చేశారు. జూదక్రీడల జోలికి పోవద్దని అవగాహన కల్పించారు. జబర్లపూడి సర్పంచ్ శేషవర ప్రసాద్‌పాల్గొన్నారు.

గోదాదేవికి సారె సమర్పణ

హనుమాన్‌జంక్షన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం ధనుర్మాసం సందర్భంగా ఆలయంలో తిరుప్పావై పారాయణం నిర్వహిస్తున్న గోష్టి సభ్యులు గోదాదేవికి సారె సమర్పించారు. ఆలయ ట్రస్టీ కాకాని అరుణబాబు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు ,అభిషేకాలు నిర్వహించారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వలస కార్మికుల కుటుంబాలకు అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : వీరవల్లి, ఎ.సీతారాంపురం శివారులో నివశించే వలస కార్మికుల కుటుంబాలకు సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ధర్మప్రచారక్ యడవల్లి పాండురంగారావు పాల్గొన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాపులపాడు మండల మహిళా కన్వీనర్ పాలమను కనకరత్నం మామయ్య ముసలయ్య జ్ఞాపకార్థం సుమారు 65 కుటుంబాలకు అన్నదానం నిర్వహించి, చిన్నారులకు స్నాక్స్, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాపులపాడు మండల సహ కన్వీనర్ దావులూరి శ్రీహరి, పాలమను నాని తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని వినతి

కంకిపాడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : దావులూరు గ్రామంలో అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను కోరినట్లు ఆ గ్రామ పార్టీ అధ్యక్షుడు జల్లె కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యేను కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో జల్లె కోటేశ్వరరావు మాట్లాడుతూ 2018- 19 మధ్య టీడీపీ హయాంలో దావులూరు గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారని, వైసీపీ హయాంలో ఒక్క ఇటుక రాయి కూడా పేర్చలేదన్నారు. శిథిలావస్థకు చేరిన భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు విజ్ఞప్తి చేయగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి భవన నిర్మాణానికి అవసరమైన అనుమతులు తీసుకోవాలని, ఏడాదిలోగా భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరినట్లు కోటేశ్వరరావు తెలియజేశారు. సీతారామయ్య, గాలంకి వెంకటేశ్వరరావు, ప్రసాద్ విజయ్, కందుల రాజేష్, గుంజా ఎలిషారావు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న జల్లె కోటేశ్వరరావు

బాపులపాడులో ప్రొటోకాల్ రగడ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి స్థానిక ఎంపీటీసీలకు కనీస సమాచారం కూడా ఇవ్వట్లేదని, తమ పరిధిలో జరిగే పనుల వివరాలు చెప్పకపోగా ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశానికి కూడా కొంత మందికి సమాచారం లేదని రంగన్నగూడెం ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, ఆరుగొలను ఎంపీటీసీ దేవంభట్ల పురుషోత్తమశర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటి వరకూ మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలు, కేటాయించిన నిధుల వివరాల సమాచారం కావాలని వైస్ ఎంపీపీ చందు రమాదేవి కోరారు. కోడూరుపాడులో ఎంపీపీ స్కూల్ ప్రైవేటు అద్దె భవనంలో నడుస్తున్నా ఇంతవరకూ ఎటువంటి చర్యలు తీసుకోలేదని, ఇటీవలే యజమాని ఖాళీ చేయాలని చెప్పడంతో తాము ప్రాధేయపడి అక్కడే నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని వైస్ ఎంపీపీ రమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల కేటాయింపు వివరాలు, పనుల వివరాలు త్వరలోనే అందజేస్తామని ఎంపీడీఓ జోగేశ్వరరావు వివరణ ఇచ్చారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ విధిగా పాటించేలా అధికారులను ఆదేశించినట్లు ఎంపీపీ నగేష్ తెలిపారు.

13 నుంచి వెంకమ్మ పేరంటాల అమ్మవారి జాతర

ప్రసాదంపాడు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాల అమ్మవారి దేవస్థానంలో సంక్రాంతి జాతర మహోత్సవాలు 2025కు చెందిన కరపత్రాలు, 2025 క్యాలెండర్లను ఈవో పి. ప్రియాంక మంగళవారం విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి 18 వరకు సంక్రాంతి జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ ముఖ్య అర్చకులు ఇనుగంటి లక్ష్మీనరసింహశర్మ, శివాలయం అర్చకులు పావులూరి హనుమత్ అశోక్, ఆలయ సహాయ అర్చకులు వెంపటి దుర్గాప్రసాద్, దేవస్థానం సూపర్ వైజర్ ఏ.మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు విడుదల చేసిన ఈవో పి. ప్రియాంక

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో భూ వివాదాలు, సర్వే వివాదాలను పరిష్కరించేందుకే గ్రామస్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. రామన్నగూడెం సర్పంచ్ వీరాంజనేయులు ఆధ్యక్షతన మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రీసర్వే వల్ల భూములు తగ్గాయని 3ఫిర్యాదులు, ఆధార్ నెంబరు తేడాపై 2ఫిర్యాదులు వచ్చినట్లు వీఆర్వో మేరీ వివరించారు. ఈ కార్యక్రమంలో వడ్లమూడి నాని, శ్రీనివాసరావు, దాసు, పాల్గొన్నారు.

ఉయ్యూరు: ప్రభుత్వం ప్రారంభించిన రీసర్వే ప్రాజెక్ట్ భూయజమానులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.సురేశ్‌కుమార్ అన్నారు. రీ సర్వే ప్రాజెక్ట్‌పై జబర్లపూడిలో మంగళవారం గ్రామసభ నిర్వహించి రీసర్వే వల్ల ప్రయోజనాలు తహసీల్దార్ తెలియచేశారు. సర్పంచ్ శేషవరప్రసాద్, సర్వేయర్ డి సురేశ్, డీటీ వెంకటేశ్వరరావు, ఆర్ఐ యతేంద్ర యులు పాల్గొన్నారు.

గన్నవరం:సావరగూడెం ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడుతుందని వెంటనే తొలగించాలని గ్రామానికి చెందిన పసుమర్తి శివ అధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ గ్రామ సభ జరిగింది. ఎఫ్ఏ పనికి రాని వారి పేర్లు, గ్రామంలో లేని వారి పేర్లను పని చేసినట్లుగా నమోదు చేసి డబ్బులు తీసుకుంటుందని ఆరోపించారు. ఉపాధి హామీ నిధులను దారి మళ్లించి దుర్వినియోగానికి పాలుపడుతుందన్నారు. తనకు అనుకూలమైన వారికి మస్తర్‌లు వేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.


సభలో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

రైతు బజార్లలో రేట్ల రంకెలు

జీవో నెం.29 నిబంధన మాయం
రాజకీయ నేతల అండతో దళారుల దౌర్జన్యం

- లక్షల్లో జేబులు నింపుకుంటున్న వైనం
- వినియోగదారుల జేబులకు చిల్లు
- ఉన్నతాధికారుల దృష్టి అవసరం



రైతుబజార్లలో కూరగాయల ధరలు రంకెలు వేస్తున్నాయి. దళారులు తమ దౌర్జన్యంతో వినియోగదారుల్ని దగా చేస్తున్నారు. కూరగాయలకు రేట్లు నిర్ణయించే ప్రక్రియలో జీవోను కాలరాసి సపరేట్‌గా అధిక రేట్లు నిర్ణయించుకొంటూ మార్కెట్ మాఫియా విజృంభిస్తోంది. రోజువారీగా లక్షల్లో, నెలవారీగా రూ. కోట్లల్లోనే తమ జేబులు నింపుకొంటున్నారు. ఒక వైపు మార్కెటింగ్ అధికారులు, ఇంకోవైపు రాజకీయ నేతలు, వీరిద్దరితో చేతులు కలిపి దళారులు రైతుబజార్లలో కాసులపంట పండించుకొంటున్నారు. అడిగేవారు లేరనే ధైర్యమో, ఏమోగానీ రైతుబజార్లను మాత్రం తమ ఎస్టేట్‌లుగా మార్చుకొని మార్కెటింగ్ మాఫియా నడుపుతున్నారు. - విజయవాడ కల్చరల్, ఆంధ్రజ్యోతి

రైతుబజార్లలో రైతు స్టాల్స్, డ్వాక్రా గ్రూపులు, పీహెచ్‌సీ స్టాల్స్ వంటి మూడు రకాల దుకాణాలుంటాయి. ఈ స్టాల్స్‌లో కూరగాయల ధరల నిర్ణయాన్ని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు విజయవాడ కేంద్రంగా ప్రతిరోజు నిర్ణయిస్తారు. ఒక్కో రైతుబజారుకు చెందిన ఈవో ఒక్కోరోజు ధరలను నిర్ణయిస్తాడు. రాష్ట్ర ప్రభుత్వం 2012 ఫిబ్రవరి 16న ఇచ్చిన జీవో నెం.29 ప్రకారం హోల్‌సేల్ మార్కెట్ కమిటీ రూ.2 అధికంగాను రిటైల్ మార్కెట్ కంటే రూ.2 తక్కువగాను ధరను సమన్వయం చేసి నిర్ణయించాలి. దీంతో వినియోగదారులకు తక్కువ ధరల్లో కూరగాయలు లభించే అవకాశం, రైతులకు గిట్టుబాటయ్యే ధరలు కల్పించడంలోనూ రైతు బజార్లకు మంచి మార్కెటింగ్ వస్తోంది. అందుకే వినియోగదారులు తమ కూరగాయలు రైతుబజార్‌లో కొనుగోలుకే ఎక్కువ ఆసక్తి చూపిస్తారు. అయితే కొంతమంది దళారులు రాజకీయ నేతల అండదండలతో చెలరేగి ప్రతి రైతు బజారులో ఒక మార్కెట్ మాఫియాగా మారి తమకు అనువుగా మార్చుకొంటున్నారు. మార్కెటింగ్ శాఖ, ఎస్టేట్ అధికారులకు, ముడుపుల ఆశ చూపి రూ.2 కంటే మించి పెట్టకూడని ధరలను రూ. 6 నుంచి రూ.10 వరకు అధికంగా పెంచి బోర్డులో నిర్ణయం చేసి రోజువారీగా రూ.లక్షల్లో సొమ్ము చేసుకొంటున్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని 25కు పైగా రైతుబజార్ ధరలు నిర్ణయం విజయవాడ కేంద్రంగా సాగడంతో ఇక్కడి నుంచే మార్కెటింగ్ అధికారులు చక్రం తిప్పుతున్నారు. కూరగాయలు అమ్మే వ్యాపారుల దగ్గర లాభంలో వాటాలను క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర కార్యాలయం వరకు మార్కెటింగ్ అధికారుల్లో కొందరు దళారులతో కలిసి వాటాలు పంచుకుంటున్నారు. మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కార్యాలయాల్లో ఉన్నతాధికారుల వద్ద పనిచేస్తున్న పీఏలు సైతం ఈ ధరల నిర్ణయంలో అండగా ఉంటూ అభయహస్తం అందిస్తున్నారు. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో ఒక్కోరోజు ఉల్లిపాయలు 45 టన్నులు, అల్లం 30 టన్నులు, వెల్లుల్లి 30 టన్నులు, క్యారెట్ 20టన్నులు, బీట్రూట్ 5 టన్నులు, కాప్సికం, బీన్స్ కలిపి 4 టన్నులు, టమోటాలు 50 టన్నులు, దుంపలు 30 టన్నులు అమ్ముడుపోతున్నాయి. రోజుకయితే కేజీకి రూ.6 నుంచి రూ.10 వరకు అధిక ధరలు నిర్ణయిస్తున్న అధికారులకు ఈ రకం కూరగాయల అమ్మే వ్యాపారుల నుంచి పెద్దమొత్తంలో మామూళ్లు అందుతున్నాయి. ప్రధానంగా ఇంగ్లీష్ కూరగాయలు విక్రయాల్లో అధిక రేట్లు నిర్ణయిస్తున్నారు. సుమారు రోజుకు 214 టన్నులు అమ్ముతున్న రెండు జిల్లాల కూరగాయల ధరల్లో తక్కువలో తక్కువ రూ.6 అధికం ధర లెక్కవేసినా, వచ్చే లాభాలు ఏ స్థాయిలో ఉన్నాయనేది అర్థమవుతోంది. రోజుకు రూ.13 లక్షల పైనే అంటే నెలకు రూ.4 కోట్లకు పైగా దండుకుంటున్నారు. దీంతో సీఎం చంద్రబాబు నాయుడు 19 ఏళ్ల క్రితం ప్రవేశపెట్టిన రైతుబజార్ల లక్ష్యాన్ని దళారులు తుంగలో తొక్కి భ్రష్టు పట్టిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్రస్థాయి మార్కెట్ శాఖలో ఉన్నతాధికారులు ధరల నిర్ణయంపై దృష్టిసారించి మార్కెటింగ్ శాఖలో పటిష్టమైన సవరణలు చేయాల్సి ఉందని వినియోగదారులు ఆకాంక్షిస్తున్నారు.



స్పెషల్ చీఫ్ సెక్రటరీ (హెల్త్) ఎంటీ కృష్ణబాబుని సచివాలయంలో కలిసి సత్కరిస్తున్న ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నేతలు

హెల్త్ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి సత్కారం

బస్‌స్టేషన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): 2020 జనవరి 1 నుంచి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు, ఇక ముందు పదవీ విరమణ చేయబోయే ఉద్యోగులకు హెల్త్ స్కీమ్ అమలు చేస్తూ ఈనెల 6న జీవో జారీ చేసినందుకు హెల్త్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబును ప్రజా రవాణ సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర శాఖ నేతలు మంగళవారం సత్కరించారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు మేలు చేసినందుకు ఆయనకు దుశ్శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందచేసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు పుట్టపర్తి వెంకటరమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు శ్రీనివాసరాజు, ఎన్.వి.రమణ, సంయుక్త కార్యదర్శి ఎస్.రాజేష్ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించి కాంట్రాక్టర్లను ఆదుకోండి

- సీఎంకు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర చైర్మన్ విజ్ఞప్తి

లబ్బీపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బకాయిపడిన బిల్లులను సాధ్యమైనంత త్వరగా చెల్లించి కాంట్రాక్టర్లను ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర చైర్మన్ అత్తలూరి నాగమల్లేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నగరంలోని ఒక హోటల్‌లో అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బిల్లులు రాక ఆత్మహత్య చేసుకున్న కాంట్రాక్టర్ బి.జనార్దన్ రెడ్డికి అసోసియేషన్ సభ్యులు సంతాపం తెలిపారు. అనంతరం అసోసియేషన్ సభ్యుడు పంకజ్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు రాక సుమారు 56 మంది కాంట్రాక్టర్లు అప్పులు ఒత్తిడిని భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డారని వారిలో అనంతపురానికి చెందిన యువ కాంట్రాక్టర్ జనార్దన్ రెడ్డి ఒకరన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం కాంట్రాక్టర్లను ఆదుకోవాలని కోరారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక కొంత వెసులుబాటు కల్పించడం జరిగిందని, మిగిలిన బిల్లుల బకాయిలపై ఆయన తమ బాధలు, కష్టాలను గుర్తించి మంజూరు చేయాలని కోరారు. బి.రాఘవరావు, సిహెచ్. రామకోటయ్య, వల్లభనేని వెంకటేశ్వరరావు, పి.రాజబాబు పాల్గొన్నారు.



వర్షపు నీటిని ఒడిసిపట్టి సద్వినియోగపరిచే వ్యవస్థను ప్రదర్శిస్తున్న సంతబొమ్మాళి ఉన్నత పాఠశాల విద్యార్థులు

ఘనంగా సైన్స్ ఎక్స్‌పో ప్రారంభం

పెనమలూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) ఆధ్వర్యంలో పోరంకి మురళీ రిసార్ట్‌లో మంగళవారం నుంచి రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన వైభవంగా ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి వ్యక్తిగత విభాగం, టీం విభాగం, ఉపాధ్యాయ విభాగాల్లో మొత్తం 156 ప్రాజెక్టులు ప్రదర్శనకు వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 400 మందికిపైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ ప్రదర్శనలను ప్రదర్శించారు. 40 పాఠశాలల నుంచి 3వేలకు పైగా విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. ప్రదర్శనను తిలకించేందుకు వచ్చిన విద్యార్థినీ విద్యార్థులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ ప్రాజెక్టుల్లో వ్యక్తిగత విభాగం నుంచి 15, టీం విభాగం నుంచి 10, ఉపాధ్యాయ విభాగం నుంచి 10 ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి ఈనెల 20నుంచి 25వరకు పాండిచ్చేరిలో జరిగే దక్షిణ భారత స్థాయి విద్యా ప్రదర్శనకు పంపిస్తామని ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. విద్యాశాఖ డైరెక్టర్, కమిషనర్ డాక్టర్ విజయరామరాజు, ఉమ్మడి కృష్ణా జిల్లాల డీఈవోలు యూవీ సుబ్బారావు, విజయరామారావు, గుడివాడ ఉప విద్యాశాఖాధికారిణి పద్మరాణి పాల్గొన్నారు.

గ్రామాల్లో చెత్తకు చెక్ చెబుదాం

- నూతన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు ప్రతి జిల్లాలోని ఒక మండలంలో పైలట్ ప్రాజెక్ట్
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

వన్‌టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వాగతం పలికే చెత్తకు చెక్ పెట్టాల్సిన అవసరం ఉందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. విజయవాడలో మంగళవారం అన్ని జిల్లాల కన్సల్టెంట్లతో రాష్ట్రస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎం చంద్రబాబు స్వచ్ఛాంధ్రపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. 2047 డాక్యుమెంట్ విడుదల సందర్భంగా చంద్రబాబు చేసిన సూచనలను అమలు చేయాలన్నారు. ప్రతి నెలా మూడో శనివారాన్ని స్వచ్ఛాంధ్ర దినోత్సవంగా పాటించాలని సీఎం చెప్పారన్నారు. గత ప్రభుత్వ హయాంలో సాలిడ్ వేస్ట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టలేదన్నారు. స్వచ్ఛతలో మన రాష్ట్రంలోని ఏ విభాగంలో చూసినా దిగువస్థాయిలోనే ఉందని, దీన్ని మెరుగుపరచుకుని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. స్మశాన వాటికలో చెత్త డంప్ చేశారన్న కారణంతో నడిరోడ్డుపైనే అంత్యక్రియలు చేశారన్న ఒక కథనం తనను కలిచివేసిందని, ఇంతకంటే దౌర్భాగ్యం మరొకటి ఉంటుందా అని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో సమావేశమైనప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో ఒక నూతన ప్రక్రియ ద్వారా కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారన్నారు. ఇందుకోసం ప్రతి జిల్లాలో ఒక మండలాన్ని పైలట్ ప్రాజెక్టు కింద తీసుకుని అమలు చేస్తామన్నారు. మిగతా 650 మండలాల్లోనూ ఇదే ప్రక్రియను చేపట్టి మంచి ఫలితాలను రాబట్టేందుకు అడుగులు వేస్తామన్నారు. ఏ గ్రామంలోకి వెళ్లినా తొలుత చెత్తే స్వాగతం పలుకుతుందని, చెత్త ద్వారా సంపదలు సృష్టించవచ్చన్న విషయాలు కాగితాలకే పరిమితమయ్యాయన్నారు. ఇలాంటి పరిస్థితిని మార్చాలని వీలైనంత త్వరగా ఒక మంచి కార్యాచరణను సిద్ధం చేసుకుని ముందుకు వెళతామన్నారు.



మాట్లాడుతున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్



విద్యాసాగర్‌ను సత్కరిస్తున్న సంఘం నేతలు

ఏపీఎన్జీవో రాష్ట్ర ప్రధానకార్యదర్శి
విద్యాసాగర్‌కు ఘన సత్కారం

ధర్నాచౌక్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ఐదేళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా ఎన్నికైన ఏ విద్యాసాగర్‌ను గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో ఆంధ్రప్రదేశ్ పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడారు. విద్యాసాగర్ వంటి వ్యక్తులు రాష్ట్రస్థాయి పదవులో ఉండటం వల్ల సంఘంలోని ప్రతి ఒక్కరికి ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. పెన్షనర్ల ప్రధాన సమస్య అడిషనల్ క్వాంటమ్ విధానాన్ని సీఎం చంద్రబాబు పరిష్కారిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యాసాగర్ మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన పెన్షనర్ల ఆకాంక్షలు నెరవేర్చేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. గత ఐదేళ్ల ఉద్యోగులు, పెన్షనర్లు నరకయాతన అనుభవించారన్నారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎన్జీవో సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బీవీ సుబ్బయ్య, ఉపాధ్యక్షుడు అబ్దుల్‌కరీం, రాష్ట్ర పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, పలువురు సభ్యులు, సిటీ అధ్యక్షుడు సీవీఆర్.ప్రసాద్ పాల్గొన్నారు.

తాగి వస్తున్నాడంటూ వైద్యుడిపై ఫిర్యాదు



పెనమలూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోని ప్రభుత్వాసుపత్రిలో ప్రధాన వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న వైద్యుడు డాక్టర్ బిజిలీ శ్రీనివాస్ నిత్యం మద్యం, తాటికల్లు సేవించి విధులకు హాజరవుతున్నాడంటూ పెనమలూరు గ్రామస్థులు జిల్లా కలెక్టర్ బాలాజీకి, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిణి శర్మిష్టకు మంగళవారం మచిలీపట్నంలో ఫిర్యాదు చేశారు. పెనమలూరు పీహెచ్‌సీ డాక్టర్ శ్రీనివాసరావు, ఆసుపత్రి వాచ్‌మన్‌లిద్దరూ కలిసి గ్రామ పొలిమేర డొంకరోడ్డులో కల్లు, మద్యం సేవించి విధులకు హాజరై రోగులకు సరిగ్గా వైద్య చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని, అదేమని అడిగితే తనది తెలంగాణ అని, తామక్కడ ఇలాగే ఉంటామని బదులిస్తుండడంతో విసుగు చెందిన ప్రజలు సదరు వైద్యుడు బిజిలీ శ్రీనివాసరావుపై మంగళవారం ఉన్నతాధికారులకు అర్జీలిచ్చారు. ఇకనైనా సదరు డాక్టరును విధుల నుంచి తప్పించి మరో మంచి వైద్యుడిని నియమించాలని అభ్యర్థించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పెనమలూరు గ్రామస్థులు చిగురుపాటి శ్రీనివాసరావు, యలమంచిలి ప్రసాద్, కోయ ఆనంద్‌ప్రసాద్, కిలారి శ్రీనివాసరావు ఉన్నారు.

పోలీసులతో అఘోరీ వాగ్వాదం

జగ్గయ్యపేట రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): టోల్‌ప్లాజా వద్ద అఘోరీ హల్‌చల్ చేసిన ఘటన మంగళవారం జరిగింది. హైదరాబాద్ నుంచి విజయవాడకు కారులో వస్తున్న అఘోరీ కారును టోల్‌ప్లాజా వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు ఆపారు. కారులో నుంచి దిగిన అఘోరీ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. సీఐ సర్దిచెప్పటంతో సమస్య సద్దుమణిగింది.



వాలీబాల్ లీగ్‌లో మధ్యప్రదేశ్‌తో తలపడుతున్న ఆంధ్రా క్రీడాకారిణులు

ఉత్కంఠగా వాలీబాల్ పోటీలు

- ముగిసిన లీగ్, నేటి నుంచి ప్రీ క్వార్టర్స్

విజయవాడ స్పోర్ట్స్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురంలో పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల వేదికగా జరుగుతున్న జాతీయ స్కూల్ గేమ్స్ వాలీబాల్ బాలికల అండర్-19 లీగ్ మ్యాచ్‌లు రెండో రోజు ఉత్కంఠ భరితంగా సాగాయి. 4 కోర్టుల్లో భారీగా మ్యాచ్‌లను చురుగ్గా నిర్వహిస్తున్నారు. సాయంత్రం ఫ్లడ్‌లైట్ల వెలుగులో నరాల తెగే ఉత్కంఠతో గెలుపు కోసం అలుపెరగక టీమ్‌లు తలపడ్డాయి. రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజేషన్ సెక్రటరీ భానుమూర్తిరాజు, అసిస్టెంట్ సెక్రటరీలు రాధాకృష్ణ, రాజు, జిల్లా అండర్-19 కార్యదర్శి వీ రవికాంత అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు. వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాదెళ్ల బ్రహ్మాజీరావు పాల్గొన్నారు.

లీగ్‌లలో ముందంజ: తుది పోరుకు అర్హతలో నిలబడాలంటే ప్రతి మ్యాచ్ కీలకం కావడంతో జట్లు చెమటోడ్చుతున్నాయి. మధ్యప్రదేశ్.. చండీఘడ్, ఉత్తరాఖండ్‌పైన, ఆంధ్రప్రదేశ్.. ఉత్తరాఖండ్, చత్తీస్‌ఘడ్‌పైన కర్నాటక.. బీహార్, జార్ఖండ్, ఒడిశాపైన, హిమాచల్‌ప్రదేశ్ తెలంగాణ, పంజాబ్‌పైన విజయం సాధించాయి.

సిద్ధార్థలో మేడసాని సమ్మోహన అవధానం

విజయవాడ కల్చరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు శాఖ సారథ్యంలో మంగళవారం విజయవాడలోని సిద్ధార్థ కళాశాల సెమినార్ హాలులో డాక్టర్ మేడసాని మోహన్ తన అష్టావధానంతో అందరినీ సమ్మోహనపరిచి వాగ్దేవి వరపుత్రుడిగా మరోసారి నిరూపించుకొన్నారు. నిషిద్ధాక్షరి నిర్వహించిన శతావధాని డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ మాట్లాడుతూ ఇది సిద్ధార్థ కళాశాలతో పాటు మేడసాని మోహన్ అవధాన స్వర్ణోత్సవంగా పేర్కొంటూ పొగమంచును కందపద్యంలో వర్ణించాల్సిదిగా కోరగా అవధాని వెంటనే శ్రీ హేలామయకాంక్ష అంటూ శ్రీకారం చుట్టారు. న్యస్తాక్షరి అంశాన్ని నిర్వహించిన విశ్రాంత తెలుగు అధ్యాపకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు సిద్ధార్థుడి బోధనలను చంపకమాలలో చెప్పాల్సిందిగా కోరుతూనే అవధాని ఇంటిపేరులోని ఒక్కో అక్షరం ఒక్కో పాదంలో వచ్చేట్టు కట్టడి చేయగా జడులనవేయ వాఙ్మయ విశాలురుగా వెలిగించే బుద్ధదేవుడా అంటూ వర్ణించారు అవధాని. విశ్రాంత ఆంధ్రోపన్యాసకుడు పింగళి వెంకట కృష్ణారావు అవధానికి సమస్యను ఇస్తూ స్త్రీలకు మొక్కినన్ కలుగు క్షేమము సౌఖ్యము మోక్షమెపుడున్ అనే పాదం చెప్పగా కాల ప్రవాహము అఖండముగా తనియింపచేసి అంటూ స్పందించారు అవధాని. అధ్యాపకుడు డాక్టర్ జీవీ చలపతి రావు పద్యం, మద్యం, హృద్యం, గద్యం అనే దత్తపది ఇస్తూ శార్దూలంలో భాగవత ప్రాశస్త్యాన్ని చెప్పమనగా పద్యంబుల్ వడి వ్యాసపోతనల వాగ్విహార విస్ఫూర్తి శ్రీ మద్యం బ్రహ్మల అంటూ దత్తపదిని సమయస్ఫూర్తితో అవధాని పూరించారు. తెలుగు సహాయక ఆచార్యుడు డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణ వర్ణన అంశాన్ని ఇస్తూ సంగీ, సాహిత్య వేదికగా బెజవాడను వర్ణించమని కోరగా ఆశువుగా హృద్యంగా పద్యం చెప్పారు అవధాని. పురాణ కావ్య పఠన అంశాన్ని వలివేటి శివరామకృష్ణమూర్తి నిర్వహించగా, కేబీఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతు రామకృష్ణ అప్రస్తుత ప్రసంగం చేశారు. ఆశువు అంశాన్ని నిర్వహించిన విద్యార్థులు పుస్తక మహోత్సవం, సిద్ధార్థ కళాశాల స్వర్ణోత్సవం తదితర అంశాలపై పద్యాలు కోరగా అవధాని తనదైన మెరుపువేగంతో పద్యాలు చెప్పి అలరించారు. అనంతరం అవధాని డాక్టర్ మేడసాని మోహన్‌తో పాటు పృచ్ఛకులను డీన్ డాక్టర్ రాజేష్ జంపా, ఏవో శ్రీధర్ ఘనంగా సత్కరించారు. తొలుత సహాయక ఆచార్యుడు డాక్టర్ సశ్రీ అవధానిని, పృచ్ఛకులను సభకు పరిచయం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మేకా రమేష్, శాఖాధిపతి డాక్టర్ ఎస్.శివకుమార్ పాల్గొన్నారు.



అవధానంలో పాల్గొన్న మేడసాని మోహన్, పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ తదితరులు

ఈఆర్సీ ఎదుట శీర్షాసన నిరసన

- వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు తొలగించాలని డిమాండ్



శీర్షాసనం వేసి నిరసన తెలియజేస్తున్న రైతు, వినతిపత్రాలిస్తున్న వామపక్షాల నేతలు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, బాబూరావు తదితరులు

విజయవాడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పంపిణీ సంస్థల 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ, వ్యయాలపై ప్రజాభిప్రాయాన్ని సేకరించిన విద్యుత్ నియంత్రణ మండలి ఎదుట ఓ రైతు శీర్షాసనం వేసి నిరసన తెలిపాడు. ముందు, వేదిక బయట వామపక్షాలు నిరసన తెలిపాయి. ఈఆర్సీ తూర్పు ప్రాంత, మధ్యప్రాంత, దక్షిణ ప్రాంత పంపిణీ సంస్థలకు ప్రజాభిప్రాయాన్ని విజయవాడలోని ప్రైవేటు కన్వెన్షన్ హాలులో మంగళవారం నిర్వహించింది. ఇన్‌చార్జి చైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్, సభ్యుడు పి.వెంకటరామిరెడ్డికి పంపిణీ సంస్థల సీఎండీలు నివేదికను చదివి వినిపించారు. అనంతరం ప్రజల నుంచి అభిప్రాయాన్ని సేకరించడానికి సిద్ధమవుతుండగా ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లికి చెందిన రైతు సంఘ నేత చెరుకూరి వేణుగోపాలకృష్ణ రైతులకు న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ వేదిక వద్దకు వెళ్లారు. వ్యవసాయ రంగాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు అమర్చొవద్దని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలెన్ని ఉన్నా రైతులంతా ఒక్కటేనని స్పష్టం చేశారు. ఆయన నినాదాలు చేయడంతో పోలీసులు, విద్యుత్ సిబ్బంది ఆయనను వారించే ప్రయత్నం చేశారు. మహిళా ఉద్యోగి ఆయనను పక్కకు లాగుతుండగా తీవ్రంగా పరిగణించారు. "నేను నిన్ను పట్టుకుంటే తప్పు. నువ్వు నన్ను ఎందుకు పట్టుకుంటున్నావ్" అంటూ కేకలేశారు. అభిప్రాయాన్ని చెప్పడానికి అవకాశం ఇస్తామని ఈఆర్సీ ప్రతినిధులు చెప్పడంతో శాంతించాడు. పోలీసులు ఆయనను అక్కడి నుంచి లాక్కొచ్చి కుర్చీలో కూర్చోబెట్టారు.

వృద్ధురాలి
దారుణ హత్య

ఇబ్రహీంపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధురాలు దారుణహత్య గురైన ఘటన కొండపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మైలవరం మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన కుంచాల ఎస్తేరు అలియాస్ చంచమ్మ (60) కొండపల్లి ఖిల్లా రోడ్డులో సమీపంలోని చంద్రన్న కాలనీలో చర్చి నిర్మాణం చేపట్టింది. ఆమె భర్త పాస్టర్‌గా పని చేస్తూ ఏడాది క్రితం మృతి చెందాడు. చర్చి నిర్మాణ పనుల్ని పర్యవేక్షించి సోమవారం రాత్రి చర్చిలోనే నిద్రించింది. మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఆమెను హత్య చేసి పరారయ్యారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. స్థానికుల సమాచారంతో ఏసీపీ దుర్గారావు అక్కడికి చేరుకొని ఎస్తేరు మృతదేహాన్ని పరిశీలించగా తల వెనుక బలమైన గాయం ఉన్నట్లు గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి పంపి కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అర్ధరాత్రి తమ్ముళ్ల కుమ్ములాట

- ముస్తాబాదలో అక్రమంగా మట్టి తరలిస్తున్నారని లారీల అడ్డగింపు
- ఘటన ప్రాంతానికి చేరుకున్న ఎమ్మెల్యే ప్రధాన అనుచరులు
- వాగ్వాదం పెరిగి తన్నుకున్న టీడీపీ నేతలు.. పోలీసు కేసు నమోదు



గన్నవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్తాబాదలో సోమవారం అర్ధరాత్రి టీడీపీ నేతలు కుమ్ములాడుకున్నారు. గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కంచర్ల శివ రైల్వే కాం ట్రాక్టర్ వద్ద పని చేస్తున్నా డు. 10 రోజుల క్రితం రైల్వే పనులు నిలిచిపోగా మట్టి ఫిల్లింగ్ కాంట్రాక్టు వచ్చింది. ముస్తాబాద శివారులోని ఫ్లిప్‌కార్ట్ సమీపంలో వేసిన వైభవ్ వెంచర్‌లో మట్టి తీయాల్సి వచ్చింది. దాన్ని కంచర్ల శివకు చెప్పటంతో ఆ మట్టిని గ్రామంలోని మద్యం షాపు సమీపంలోని వెంచర్‌లోకి తోలుతున్నారు. అది తెలిసిన తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కొసరాజు సాయిరాం టిప్పర్లను అడ్డుకున్నారు. దీంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. అప్పటికే సాయిరాం ఎమ్మెల్యే యార్లగడ్డ అనుచరుడైన సునీల్‌కు, తెలుగు యువత నేత పరుచూరి నరేష్‌కి సమాచారం ఇవ్వడంతో ముస్తాబాద వచ్చారు. అక్రమంగా మట్టి ఎందుకు తరలిస్తున్నారని ప్రశ్నించారు. తాము ఏ పార్టీయో తెలీదా అని కంచర్ల శివ బదులిచ్చారు. కంచర్ల శివ సోదరుడు ముత్యాలు అదే సమయానికి అటునుంచి వచ్చాడు. వాహనాలు నిలిచిపోవటంతో ఏం జరిగిందని రాగా అక్కడ మాటా మాట పెరగడంతో పరుచూరి నరేష్‌ను, కొసరాజు సాయిరాంను కొట్టారని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది అక్కడికి చేరుకుని గొడవ సద్దుమణిగాక లారీలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మట్టి తోలుతున్నందుకు నగదు ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు చెబుతున్నారు. నగదు ఇవ్వకపోవడంతోనే ఇంత రాద్ధాంతం చేశారని గ్రామంలో ప్రచారం జరుగుతోంది. దీనిపై 6 లారీలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు.



దొండపాడులో రెవెన్యూ సదస్సు

గుడివాడ రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సుల ప్రయోజనాలను ప్రజలకు వివరించి, సమస్యలను పరిష్కరిస్తున్నామని తహసీల్దార్ రామకోటేశ్వరరావు అన్నారు. దొండపాడు రెవెన్యూ సదస్సులో పట్టాదారు పాస్ పుస్తకాలు, టైటిల్ డీడ్‌లపై అవగాహన కల్పించారు. ప్రతీ రైతు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేసి వెంటనే పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. ఆర్ఐ నాగబాబు, రైతులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



బీజేపీ బలోపేతానికి కృషి

గుడివాడ, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని పట్టణ బీజేపీ అధ్యక్షుడు కావేటి దుర్గాప్రసాద్, మాచర్ల రామకృష్ణ తెలిపారు. బీజేపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. గన్నవరంలో జరిగిన హైందవ శంఖారావం బహిరంగ సభను జయప్రదం చేసిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. వార్డుల వారీగా పార్టీ బలోపేతానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామన్నారు. నందివాడ మండల అధ్యక్షుడు వాసుపల్లి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెదపారుపూడి మండల సమావేశం రేపు

పెదపారుపూడి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పెదపారుపూడి మండల పరిషత్ సమావేశం 9వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు అధ్యక్షుడు గోగం సురేష్ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో పి.సీతామహాలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాల్సిందిగా కోరారు.

ప్రజాభీష్టం మేరకు పనిచేయండి

మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కుమార్ రాజా

తోట్లవల్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : అధికారులు ప్రజల అభీష్టానికి అనుగుణంగా పని చేయాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మంగళవారంపాల్గొన్న ఎమ్మెల్యే వివిధ శాఖల పనితీరుని సమీక్షించారు. మండల వ్యవసాయాధికారి జి నాగేశ్వరరావు సెలవులో ఉండడంతో ఆయన స్థానంలో మండల సమావేశానికి వచ్చిన భద్రిరాజుపాలెం ఆర్ఎస్‌కె ఉద్యానశాఖ అసిస్టెంట్ మురళీ మాట్లాడుతుండగా ఎంపీటీసీ సభ్యుడు కళ్లం సాంబశివారెడ్డి మాగాణి రైతులకు ఇచ్చిన మినుము విత్తనాల వివరాలను అడిగారు. ఆయన సమాధానం చెప్పలేకపోయారు. దీంతో ఎమ్మెల్యే కుమార్ రాజా కల్పించుకుని వివరాలు లేకపోవటంతో ఎలా అని మురళీని ప్రశ్నించారు. రైతులు అడిగిన సమాచారాన్ని ఎందుకివ్వరన్నారు. గౌరవం నిలబెట్టుకునే విధంగా ప్రజల అవసరాల కోసం పనిచేయాలని ఎమ్మెల్యే హితవు పలికారు. భద్రిరాజుపాలెం సర్పంచ్ కొక్కొలిగడ్డ హేమలత మాట్లాడుతే తన గ్రామంలో తనకు తెలియకుండానే, పంచాయితీ తీర్మానాలు లేకుండానే ఉపాధిహామీ పనులు చేయటాన్ని సభ దృష్టికి తీసుకొచ్చారు. తాను ఎక్కడా సంతకం కూడా చేయలేదన్నారు. సర్పంచ్‌కు సమాచారం ఇవ్వాలని ఎమ్మెల్యే కుమార్ రాజా అధికారులకు సూచించారు. గుర్విందపల్లిలంకలో ఎస్సీ సొసైటీ భూముల్లో కృష్ణానది వరదకు పడిపోయిన కరెంటు స్తంభాలను వేయకపోవటంతో రైతులుమొక్కజొన్న, మినుము పంటలు వేయలేకపోయరని సర్పంచ్ ఉమ్మడిశెట్టి ఉదయభాస్కర్ తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలనిఎమ్మెల్యే కుమార్ రాజాకు వినతిపత్రం అందించారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామని అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో రవికాంత్, తహసీల్దార్ కుసుమకుమారి పాల్గొన్నారు.



ఉద్యానశాఖ అసిస్టెంట్ మురళీని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా


పంచాయతీరాజ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

నెలాఖరులోగా రోడ్ల పనులు పూర్తి చేయాలి
ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రహదారుల నిర్మాణ పనులను జనవరి నెలాఖరులోపు పూర్తిచేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ప్రజావేదికలో మంగళవారం పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రహదారుల అభివృద్ధి, నిర్మాణ పనుల పురోగతిని అధికారులు ఎమ్మెల్యే వెనిగండ్లకు వివరించారు. రూ.23 కోట్లు ఉపాధి హామి నిధులతో జరుగుతున్న నిర్మాణ పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. డోకిపర్రు-నిడుమోలు రహదారి నిర్మాణం ఆలస్యంపై కలెక్టర్ బాలాజీతో ఫోన్‌లు మాట్లాడారు. నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. పంచాయితీరాజ్ డీఈ బి.రవి కుమార్, ఏఈలు సూరిబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కులగణనలో అవినీతికి పాల్పడిన ఉద్యోగులను సస్పెండ్ చేయాలి : ఎమ్మార్పీఎస్

గుడివాడ, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : గుడివాడ నియోజకవర్గంలో కుల గణనలో అవినీతికి పాల్పడుతున్న ఉద్యోగులను వెంటనే సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల సుధాకర్ డిమాండ్ చేశారు. ఆర్డీవో కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కులగణనలో మాదిగలను, మాలలుగా నమోదు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కొందరు ఉద్దేశ్యపూర్వకంగా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్నారు. నెహ్రూ చౌక్ సెంటర్‌లో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ బాలాజీకి వినతిపత్రం అందజేశారు. వెంపటి సైమన్, తాళ్ళూరి ప్రశాంత్, మామిళ్ల ఏలీషా పాల్గొన్నారు.

పెంజండ్రలో పశుగణన పరిశీలన

గుడ్లవల్లేరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : పెంజండ్ర గ్రామంలో మంగళవారం గుడ్లవల్లేరు పశుసంవర్ధక శాఖ డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ సి.శ్రీనివాస్, ఏడీలు జగన్నాథరావు, డాక్టర్ లక్ష్మీనారాయణ పశుగణన కార్యక్రమాన్ని పరిశీలించారు. పలు గృహాలకువెళ్లి పశువుల వివరాలను ఆరా తీసి నమోదు చేసుకొన్నారు. ప్రభుత్వం పశువుల పెంపకానికి ఇస్తున్న రాయితీలు, పథకాలను వివరించారు.


పశుగణన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీడీ శ్రీనివాస్ తదితరులు

పాడి రైతులకు మినరల్స్‌మిక్చర్ పంపిణీ

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పెంజండ్రలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. మాజీ సర్పంచ్ బొప్పన శివప్రసాద్ శిబిరాన్ని ప్రారంభించారు. గేదెలు, గొర్రెలు, మేకలకు పరీక్షలు నిర్వహించి మందులు, మినరల్స్ మిక్చర్ ఉచితంగా పంపిణీ చేశారు. మందులను క్లబ్ సభ్యులు వల్లభనేని రామకృష్ణ(యుఎస్ఏ) స్పాన్సర్ చేశారు. క్లబ్ అధ్యక్షురాలు శశికళ, వై.పి.సి.ప్రసాద్, బొప్పన శివప్రసాద్, నూతులపాటి ప్రసాద్, వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి,సూరపనేని పరంధామయ్య, పోలవరపు వెంకటరావు,పశుసంవర్ధక శాఖ డీడీ శ్రీనివాస్, ఏడీ గన్నాథరావు, ఏడీ డాక్టర్ లక్ష్మీనారాయణ, పశువైద్యులు చింతయ్య, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం వడ్లమన్నాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విశ్రాంత ఉపాధ్యాయులు గుత్తికొండ సుభాష్‌చంద్రబోస్ తొమ్మిది, పది తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస ఉపన్యాసం చేశారు.

సర్వీస్ ప్రొవైడర్స్ గుర్తింపు మేళా నేడు, రేపు

గుడివాడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధిలో పట్టణ ప్రజలకు వివిధ రకాల సేవలను అందించేందుకు మెప్మా ఆధ్వర్యంలో సర్వీస్ ప్రొవైడర్స్ గుర్తింపు మేళాను ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు సిటీ మిషన్ మేనేజర్ కె.ఇ.వి బసవేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్, వా టర్ ప్యూరిఫైర్, టి.వి ఇన్‌స్టలేషన్/రిపేరు. వృత్తి సంబంధిత వడ్రంగి, ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్, బ్యూటీషియన్ (పురుషుల/స్త్రీ) తదితర సేవలందించే వారిని గుర్తించి వారికి వృత్తి నైపుణ్య శిక్షణ, సాంకేతికపరమైన శిక్షణ ఇచ్చి అర్హత పొందిన వారికి జీవనోపాధి కల్పిస్తామన్నారు. ఆధార్ కార్డు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, భార్య పేరు, పొదుపు సంఘం పేరు, విద్యార్హతలు, అనుభవ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్‌లతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు సిటీ మిషన్ మేనేజర్ కె.ఇ.వి బసవేశ్వరరావు సెల్ నెం. 79016 10185, డిఆర్‌పి విజయ్‌కుమార్ సెల్ నెం. 94932 00858కు సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు.

విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలి : సీపీఎం

గుడివాడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. కామ్రేడ్ సుందరయ్యభవన్‌లో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ స్మార్ట్ మీటర్‌ల ఏర్పాటును రద్దు చేయాలని, ఆదానీతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి,లంకా సురేంద్ర, అవిర్నేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శత వసంతాల వేడుకకు తాడంకి జడ్పీ స్కూల్ ముస్తాబు


తాడంకి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, సిద్ధమవుతున్న పైలాన్, ఏర్పాట్లను పరిశీలిస్తున్న పూర్వ విద్యార్థులు

(ఆంధ్రజ్యోతి-పమిడిముక్కల)
తాడంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వంద వసంతాల వేడుకకు సిద్ధమవుతోంది. పాఠశాలలో చదివి వివిధ హోదాలు, పదవుల్లో ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వవిద్యార్థులు కమిటీగా ఏర్పడి శతాబ్ది ఉత్సవం ఈనెల 12న జరిపేందుకు అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు. ఇక్కడ విద్యనభ్యసించిన ఎందరో పారిశ్రామిక వేత్తలు, వైద్యులు, న్యాయమూర్తులు, ఎన్నారైలు, రాజకీయ నాయకులుగా ఎదిగి సమాజానికి సేవలందిస్తున్నారు. తాడంకి, పరిసర గ్రామాల పిల్లలకు విద్య నేర్పేందుకు అమ్మనమంచి వెంకట సుబ్బయ్య మాస్టారు 1915లో పూరిపాకలో ప్రారంభించారు. జమిందారులు, రైతులు 10 ఎకరాల పొలం విరాళంగా ఇవ్వడంతో 1921లో స్థానికుల ప్రోత్సాహంతో జాతీయ రహదారి పక్కన పాఠశాల పూర్తి స్థాయికి ఎదిగింది. 1961లో ఉన్నత పాఠశాల అయ్యింది. తాడంకి చుట్టుపక్కల గ్రామాల్లో పాఠశాలలు లేని రోజుల్లో పలు గ్రామాల నుంచి వచ్చి ఇక్కడ విద్యనభ్యసించేవారు. పీయూసీ, ఎస్ఎస్ఎల్‌సీ తరగతులు ఉండగా 1969 నుంచి ఎస్ఎస్‌సీ ప్రారంభించారు. ఇప్పటి వరకు 54బ్యాచ్‌ల్లో ఎనిమిది వేల మంది విద్యార్థులు ఈపాఠశాలలో పదవ తరగతి చదివి ఉన్నత విద్యనభ్యసించేందుకు వెళ్లారు. సువిశాల విస్తీర్ణంలో 30 తరగతి గదులు, ప్రయోగశాలలు, 4.5 ఎకరాలలో చక్కటి ఆటస్థలం కలిగి ఉన్న పాఠశాలలో ప్రస్తుతం 3 నుంచి 10వ తరగతి వరకు 450 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు. ఇటీవల ప్రైమ్ మినిష్టర్స్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకానికి పాఠశాల ఎంపిక కావడం విశేషం. దేశ విదేశాల్లో స్థిరపడిన వారి వివరాలు సేకరించిన కమిటీ ఉత్సవానికి వారిని ఆహ్వానించింది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు ఆహ్వానాలు పంపారు. మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ, నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన వింజమూరి శ్రీనివాసాచారి, అమెరికాలో వైద్యునిగా స్థిరపడిన పుట్టగుంట సుబ్బారావు, సినీ దర్శకుడు తాతినేని ప్రకాశరావు ఈ పాఠశాల వి ద్యార్థులే. ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జక్కా శ్రీనివాసరావు, యేనుగ మస్తాన్‌రావు, కార్యదర్శి పులి సాయిబాబు పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి.

అదృష్టంగా భావిస్తున్నాం ..



పాఠశాలశతాబ్ది ఉత్సవం నిర్వహించడం పూర్వవిద్యార్థులుగా అదృష్టంగా భావిస్తున్నాం. ఇక్కడ విద్యనభ్యసించి వివిధ హోదాల్లో దేశ, విదేశాల్లో ఎక్కడెక్కడో స్థిరపడిన వారిని, కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులను ఆహ్వానించాం.

- జక్కాశ్రీనివాసరావు, పూర్వవిద్యార్థి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు

సంతోషంగా ఉంది..



ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న సమయంలో పాఠశాల శతాబ్ధి వేడుక జరగడం అదృష్టం, సంతోషకరం. పూర్వ విద్యార్థులు, శ్రేయోభిలాషులు సేవలందించడం ఎంతో ఆనందంగా ఉంది.

- వై.ఎస్.ఎన్.ప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం

అంబులెన్స్ ఢీకొని యువకుడికి గాయాలు

పామర్రు, జనవరి7 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం- విజయవాడ ప్రధాన జాతీయ రహదారిపై బల్లిపర్రు అడ్డరోడ్డు వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. బల్లిపర్రు గూడెంకు చెందిన కలపాల మురళి (22) సెంటర్లో పనులు ముగించుకుని బైక్ మీద ఇంటికి వెళ్తుండగా విజయవాడ నుంచి మచిలిపట్నం వెళ్తున్న అంబులెన్సు వాహనం ఢీకొంది. మురళికి తీవ్రగాయాలు కావడంతో 108లో విజయవాడ ఆసుపత్రికి తరలించారు. అంబులెన్సులో ఉన్న పెషెంట్‌ను మరో కారులో బంధువులు మచిలీపట్నం తీసుకెళ్లార ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పామర్రు ఎస్సై రాజేంద్రప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేలు, జూదం నిర్వహిస్తే చర్యలు

గుడ్లవల్లేరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో కోడి పందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గుడ్లవల్లేరు ఏఎస్సై సాంబశివరావు హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ కార్యదర్శులు, వీఆర్వోలు, మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. సంక్రాంతిని పురస్కరించుకొని ఎక్కడైనా కోడిపందాలు, జూదం నిర్వహించినా సమాచారం వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎంపీడీవో విజయసారధి, తహసీల్దార్ లోకరాజు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సేవా సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

గుడివాడ, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : శ్రీనివాస్ సెంటర్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో మంగళవారం విశ్వబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా శాఖ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చింతాడ బ్రహ్మానందం ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షులు చింతలూరి సత్యనారాయణ, కార్యదర్శి డాక్టర్ శ్రీనుబాబు, కోశాధికారి ప్రవీణ్‌కుమార్, నాయకులు వసుధ బసవేశ్వరరావు, వరద వెంకటేశ్వరరావు, మాజీ అధ్యక్షులు యలమర్తి కోటేశ్వరరావు, కాశీ అర్జున్‌ప్రసాద్, భవిరి శంకరనాథ్ పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ చింతాడ, తదితరులు

తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలి

గుడివాడ రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మినుము పొలాల్లో తుప్పు తెగులు, బూడిద తెగులు కనిపిస్తున్నందున వాటి నివారణ కు చర్యలు తీసుకోవాలని ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి తెలిపారు. మంగళవారం రామన్నపూడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఏడీఏ మాట్లాడుతూ తుప్పు తెగులు నివారణకు తక్కువ మోతాదులో రసాయనిక ఎరువులు పిచికారి చేయాలన్నారు. వాతావరణ మార్పులతో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏఈవో వి.అనిత, రామన్నపూడి రైతులు పాల్గొన్నారు.



రామన్నపూడిలో రైతుతో మాట్లాడుతున్న ఏడీఏ రమాదేవి

ఏఎన్నార్ కళాశాలలో ముగ్గుల పోటీలు

గుడివాడ, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని విద్యార్థినులకు రంగవల్లుల పోటీలను నిర్వహించారు. ముగ్గుల పోటీలో బి.నాగశివమణి, ఎం.మధులత ప్రథమ బహుమతి, జి.వాసంతి, వై.అనూష ద్వితీయ, ఎం.మధులత, ఎ ప్రమీలారాణి తృతీయ బహుమతిని అందుకున్నారు. మరో 15మందికి కన్సొలేషన్ బహుమతులను అందజేశారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష,కార్యదర్శులు ఎల్ఆర్‌కె ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, మహిళ విభాగం చైర్‌పర్సన్ డి.విమలకుమారి, కార్యదర్శి ఎ.భవాని, కోశాధికారి ఎన్.నాగలక్ష్మీ, అధ్యాపకులు, పాల్గొన్నారు.


ముగ్గుల పోటీల్లో విజేతలతో కళాశాల సిబ్బంది

చినముత్తేవిలో ముగ్గుల పోటీలు 12న

కూచిపూడి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి వేడుకల్లో భాగంగా చినముత్తేవి జడ్పీ పాఠశాల ఆవరణలో ఈ నెల 12వ తేదీన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 1981-82 విద్యాసంవత్సరం పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అదే రోజు నిర్వహిస్తున్నట్లు పూర్వవిద్యార్థుల ప్రతినిధులు పోతుల చిట్టిబాబు, బెల్లంకొండ వెంకటేశ్వరరావు తెలిపారు. విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో భాగంగాగురువులను సత్కరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118, 126, 137
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.505



కనకదుర్గమ్మ సన్నిధిలో కలెక్టర్ డీకే బాలాజీ

వన్‌టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలోని కనక దుర్గమ్మను మంగళవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ దర్శించుకున్నారు. ఆయనకు డిప్యూటీ ఈవో రత్నరాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనానంతరం ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు. వేదపండితులు కలెక్టర్ బాలాజీకి ఆశీస్సులు అందజేశారు.



వసతిగృహంలోని బాలికలకు పరీక్ష ప్యాడ్‌లు, జామెంట్రీ బాక్సులు అందజేస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, చిత్రంలో జేసీ గీతాంజలిశర్మ

బాలికల వసతి గృహంలో కలెక్టర్ జన్మదిన వేడుక

మచిలీపట్నం, జనవరి7 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ డీకే బాలాజీ తన పుట్టినరోజు వేడుకలను బచ్చుపేటలోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహంలో మంగళవారం రాత్రి జరుపుకున్నారు. పిల్లల సమక్షంలో కేక్‌ను కట్ చేశారు. బాలకలు పరీక్షలు రాసేందుకు ప్యాడ్‌లు, పెన్నులు, జామెంట్రీ బాక్సులతో పాటు కాస్మోటిక్స్, మస్కిటో రీఫిల్స్‌ను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల సమక్షంలో తన పుట్టినరోజు వేడుకలను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. వనరులను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. భవిష్యత్తులో పిల్లలు ఏమి కావాలని కోరుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, తహసీల్దార్ మధుసూధనరావు, ఏఎస్‌డబ్ల్యూవో శీలం రాజశేఖరరెడ్డి, వార్డెన్ సూర్యబేగం పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.లక్ష విరాళం

చల్లపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి కోసం పోలీస్‌స్టేషన్ బజారు - హనుమాన్ నగర్ (గౌడపాలెం)లోని అభయాంజనేయస్వామి ఆలయకమిటీ పెద్దలు లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. గౌడపాలెం తరపున మన కోసం మనం ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ డీఆర్‌కె.ప్రసాద్‌ను కలిసిన ఆలయ కమిటీ పెద్దలు నగదును అందించారు. కమిటీ పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



డాక్టర్ డీఆర్కే.ప్రసాద్‌క విరాళం అందిస్తున్న ఆలయ కమిటీ పెద్దలు



అత్రిదత్త రాగసాగర కార్యక్రమంలో కళాకారులతో గణపతి సచ్చిదానంద, స్వామిని కలిసిన మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్

మచిలీపట్నానికి మంచి భవిష్యత్

• గణపతి సచ్చిదానంద స్వామి

మచిలీపట్నం టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రానున్న కాలంలో బందరు సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరుతుందని మైసూరు గణపతి సచ్చిదానంద స్వామిజీ పేర్కొన్నారు. బుట్టాయిపేట దత్తాశ్రమంలో మంగళవారం ఆయన అనుగ్రహభాషణం చేశారు. మచిలీపట్నం నగరం గొప్ప ఆధ్యాత్మిక కేంద్రమన్నారు. మూడున్నర దశాబ్దాలుగా మచిలీపట్నంతో తనకు అనుబంధం ఉందన్నారు. ఇక్కడ పవిత్ర దేవాలయాలు, పుణ్యక్షేత్రాలు భక్తులను ఆధ్యాత్మికమార్గం వైపు నడిపిస్తున్నాయన్నారు. బుట్టాయిపేటలోని దత్తాశ్రమంతో పాటు మంగినపూడి బీచ్‌లోని దత్తరామేశ్వరంలో నిర్వహిస్తున్నఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని గొప్ప అనుభూతిని పొందుతున్నారన్నారు. మానసిక రుగ్మతలకులోనై మనశ్శాంతికి దూరమైన వారిని అత్రిదత్త రాగ సాగర కార్యక్రమం ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుస్తున్నట్టు చెప్పారు. మైసూరు దత్త ఉత్తర పీఠాధిపతి విజయానంద తీర్థ స్వామి, దత్తాశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు. స్వామిజీని మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

శ్రీకాకుళేశ్వరస్వామి ఆలయంలో ఉత్తరద్వార దర్శనం10న



ఘంటసాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళంలో కొలువై ఉన్న శ్రీకాకుళేశ్వర స్వామి ఈ నెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిస్తారని డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామవర ప్రసాదరావు తెలిపారు. దేవాలయంలో తెల్లవారుజాముునుంచే స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, సహస్రనామార్చన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఉదయం 10.08 నిముషాలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ఆస్థాన పూజ అనంతరం ఉదయం 11.16 నిముషాలకు స్వామి, అమ్మవార్లు ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిస్తారన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 10వ తేదీన అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుంచి అవనిగడ్డ, చల్లపల్లి మీదుగా శ్రీకాకుళం వరకు, విజయవాడ కరకట్ట నుంచి శ్రీకాకుళం వరకు ఆర్టీసీ బస్సు సర్వీసు నడుపుతున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



ఆంజనేయ స్వామికి విశేష అర్చనలు

మచిలీపట్నం టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : చిలకలపూడిఅంజనేయ స్వామికి మంగళవారం అప్పాల మాలలతో అలంకరించారు. వెంట్రప్రగడ షణ్ముఖప్రసాద్ ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది.

కోడిపందేల నిర్వాహకుల బైండోవర్

మోపిదేవి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కోడిపందేలు, పేకాట, చిత్తులాటలు పూర్తిగా నియంత్రించే క్రమంలో భాగంగా ముందస్తుగా తొమ్మిది మంది వ్యక్తులను బైండోవర్ చేసినట్లు తహసీల్దార్ ఎం.శ్రీవిద్య తెలిపారు. పేకాట ఆడుతున్న ఇద్దరు, కోడిపందేలు నిర్వహించే ఏడుగురు వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో ఎక్కడైనా పేకాట, కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కోడిపందేలు వేస్తే చర్యలు

చల్లపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : కోడిపందాలను నిర్వహించటం చట్టరీత్యా నేరమని తహసీల్దార్ డి.వనజాక్షి, ఎంపీడీవో ఎ.వెంకట రమణ అన్నారు. మంగళవారం చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ, చల్లపల్లి మండలంలో కోడిపందాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు మాట్లాడుతూ, కోడిపందేలు, పేకాటలు నిరోధించేందుకు గ్రామ, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో పంట కాల్వల అభివృద్ధికి కృషి

అవనిగడ్డ రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సహకారంతో పంట కాల్వల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు అశ్వారావుపాలెం నీటి సంఘం అధ్యక్షుడు దాసినేని శ్రీనివాసరావు అన్నారు. సిద్దయ్యకోడు, రెండో నెంబర్ పంట కాల్వల్లో ఇరిగేషన్ శాఖ నిధులతో తూడుకాడ నిర్మూలన మందు స్ప్రేయింగ్ చేయించారు. అశ్వారావుపాలెం, బందలాయిచెరువు, గుడివాకవారిపాలెం ఆయకట్టు రైతులకు మేలు చేసేందుకు పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇరిగేషన్ ఏఈ రవితేజ, నీటి సంఘం డైరెక్టర్లు పాల్గొన్నారు.

తలశిల బాలుకు ఎమ్మెల్యే మండలి పరామర్శ

నాగాయలంక, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గుండె శస్త్ర చికిత్స చేయించుకుని కోలుకుంటున్న తలశిల బాలును ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మండలి వెంకట్రామ్ మంగళవారం పరామర్శించారు. పరామర్శించారు.

నాగాయలంక ఉపసర్పంచ్ తలశిల వెంకట నరసింహారావు, డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగ మల్లిఖార్జునరావు, భావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయ భాస్కర్, కర్రి కృష్ణమూర్తి, తలశిల శివరామకృష్ణ, తలశిల శివశంకర్, తలశిల రాఘవ, తానంకి చంటి తదితరులు పాల్గొన్నారు.

పశువుల్లో సంతానోత్పత్తిపై అవగాహన

అవనిగడ్డ రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : పశువుల్లో సంతానోత్పత్తిపై పులిగడ్డలో మంగళవారం పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఎస్ఎస్ఎస్ వీర్యం ద్వారా 90 శాతం ఆడ దూడలు పుట్టడం జరుగుతుందని పశువైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సాంబశివరావు తెలిపారు. దీని వల్ల పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. తొమ్మిది పశువులకు కృత్రిమ గర్భధారణ, గర్భవాతం పరీక్షలు చేశారు. సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, పశువైద్యాధికారిణి డాక్టర్ పి.ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమల్లి హైస్కూల్‌కు పూర్వ విద్యార్థి ఆర్థిక సాయం

పెడన రూరల్, జనవరి7 (ఆంధ్రజ్యోతి) : పెనుమల్లి హైస్కూల్ పూర్వ విద్యార్థి చిత్రపు శ్రీనివాసరావు పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్థిక సాయం అందజేశాడు. పుల్లపాడుకు చెందిన శ్రీనివాస్ పెనుమల్లి హైస్కూల్లో విద్యాభ్యాసం చేసి ప్రస్తుతం వీఆర్వోగా పనిచేస్తున్నారు. తన ఆదాయంలో ప్రతి నెలా వెయ్యి రూపాయలు పాఠశాలలో వసతుల కల్పన కోసం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీకి అందిస్తున్నారు. ప్రధానోపాధ్యాయురాలు విజయ కుమారి, కమిటీ చైర్మన్ కాట్రగడ్డ నాగ రాజు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన మత్స్యకారులతో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

30 మంది మత్స్యకారులు జనసేనలో చేరిక

అవనిగడ్డ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం పరితపించే వ్యక్తి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. నాగాయలంక మండలం పర్రచివర శివారు దీనదయాళ్‌పురం గ్రామానికి చెందిన 30 మంది మత్స్యకారులు అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి సమక్షంలో జనసేన పార్టీలోకి చేరారు. వారికి బుద్ధప్రసాద్ జనసేన కండువాలతో స్వాగతం పలికారు. అన్ని వర్గాలకు న్యాయం చేయటమే పవన్ కళ్యాణ్ ధ్యేయమన్నారు. ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, మండల పార్టీ నాయకులు బండ్రెడ్డి హరి పాల్గొన్నారు. ఎమ్మెల్యే సమక్షంలో కొక్కిలిగడ్డ మస్తాన్ రావు, రామాణి మాణిక్యాలరావు, కొక్కిలిగడ్డ పోతురాజు, కోలా బ్రహ్మం, వనమాల నరసింహారావు, నడకుదుటి తాతయ్య, రాసాని వెంకటేశ్వరరావు, నాగిడి వెంగయ్య నడకుదుటి సాయి జనసేన పార్టీలో చేరారు.



యర్రారెడ్డిపాలెంలో టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న నేతలు

కార్యకర్తలకు టీడీపీ సభ్యత్వం ఒక వరం

కోడూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు సభ్యత్వం వరంలాంటిదని మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు అన్నారు. యర్రారెడ్డిపాలెం గ్రామంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వంద రూపాయలు చెల్లించి పార్టీ సభ్యత్వం తీసుకుంటే 5 లక్షల రూపాయల వరకు ప్రమాద బీమా వర్తింపచేసి పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తున్న ఏకైక పార్టీ టీడీపీ అన్నారు. అప్పికట్ల రవీంద్ర, ముళ్లపూడి బసవయ్య, మహమ్మద్ ఇమ్రాన్, తుంగల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించాలి

మచిలీపట్నం టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి భవిత కేంద్రాలలో చేర్పించేందుకు సమగ్ర సర్వే నిర్వహించాలని డీఆర్వో కె.చంద్రశేఖర్ సూచించారు. కృష్ణాజిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మంగళవారం మండల విద్యాశాఖాధికారులకు, ఐసీడీఎస్ సీడీపీవోలకు కలెక్టరేట్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు గల పిల్లల అభివృద్ధి కోసం పాఠశాలల్లో ర్యాంపులు, ఫ్రెండ్లీ టాయిలెట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. దివ్యాంగ విద్యార్థులకు ఎస్కార్ట్ అలవెన్సు, రవాణా భత్యం, స్కాలర్‌షిప్‌లు, స్టూడెంట్ కిట్, మధ్యాహ్న భోజనం, ఇతర ఉపకరణాలు అందించాలన్నారు. మెడికల్ అసెస్ క్యాంపులు జరపాలన్నారు. సమగ్ర శిక్ష జిల్లా ఏపీసీ కె రాములు నాయక్ మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులకు ఫిజియోథెరపీతో పాటు ఉపకరణాలు పంపిణీ చేస్తున్నామన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ కామరాజు, వనజ, రామకృష్ణ, రాంబాబు, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు డి నగేష్, రమేష్, అబ్దుల్ సుభాన్, కె ఏడుకొండలు, ఓ రామకృష్ణ, జి సీతా మహాలక్ష్మి తదితరులు శిక్షణ నిర్వహించారు.

దేవరకోటలో పొలం పిలుస్తోంది

ఘంటసాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : దేవరకోట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర పరిశీలనలో భాగంగా ఏవో మురళీకృష్ణ మాట్లాడుతూ రబీ పంటగా మినుమును సాగు చేస్తున్నందున రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కలుపు యాజమాన్య పద్ధతులు పాటిస్తే కొంత వరకు నివారించుకోల్గుతామన్నారు. బంగారు తీగ ఎక్కువగా ఉన్న పొలాల్లో ఇమాజితాపిర్ మందును 200ఎంఎల్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరానికి పిచికారి చేసుకోవాలన్నారు. బంగారు తీగ పీకి వేసి తగులబెట్టాలని సూచించారు. సర్పంచ్ మద్దాల వెంకటేశ్వరరావు, వీఏఏ బి.సత్యదేవ్, రైతులు పాల్గొన్నారు.



కోడూరు రోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఎం పాదయాత్ర

కోడూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కోడూరు ప్రధాన రహదారి నిర్మాణం వెంటనే చేపట్టాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. మంగళవారం కోడూరు ప్రధాన సెంటర్ నుంచి అవనిగడ్డ ఎమ్మెల్యే కార్యాలయం వరకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. సంక్రాంతి నాటికల్లా రాష్ట్రంలో రహదారుల మరమ్మతులు పూర్తి చేస్తామన్నా వాగ్దానాన్ని సీఎం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మం డలి బుద్ధప్రసాద్, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి స్పందించి రహదారి నిర్మాణం వెంటనే చేపట్టే విధంగా తగు చర్యలు చే పట్టకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, జిల్లా నాయకులు శీలం నారాయణ రావు, కోడూరు మండల కార్యదర్శి పోలాబత్తిన మోహనరావు, ఆవుల బసవయ్య, రేపల్లె యోగ ప్రకాష్, వివిధ మండలాల సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌వీఎల్ క్రాంతి కళాశాలలో ముగ్గుల పోటీలు



అవనిగడ్డ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ముగ్గులు తెలుగు సంస్కృతికి ప్రతీకలు అని గ్రామీణ యువ జన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ సతీమణి మండలి సాయి సుప్రియ అన్నారు. ఎస్‌వీఎల్ క్రాంతి కళాశాలలో సంక్రాంతి పురస్కరించుకుని విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు తీర్చిదిద్దిన రంగవల్లులను మం డలి సాయి సుప్రియ, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ తిలకించి అభినందించారు. ముగ్గుల పోటీలు నిర్వహించిన కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. ఎస్‌వీఎల్.క్రాంతి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు దుట్టా వెంకట వసుమతి, ప్రిన్సిపాల్ ఎన్.వి. నాగేశ్వరరావు, అధ్యాపకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

వృద్ధులపై కరుణ చూపాలి

చల్లపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : వృద్ధాప్యం శాపంలా కాకుండా వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ కరుణ చూపాలని తహసీల్దార్ డి.వనజాక్షి కోరారు. తహసీల్ధార్ కార్యాలయంలో సీనియర్ సిటిజన్స్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రతి నెలా మొదటి మంగళవారం సీనియర్ సిటిజన్స్ సమావేశం నిర్వహిస్తారు. తహసీల్ధార్ మాట్లాడుతూ, మహిళా పోలీసులు గ్రామస్థాయిలో వృద్ధుల వివరాలను, వారు ఎదుర్కొంటున్న సమస్యల సమాచారాన్ని సేకరించాలన్నారు.తల్లిదండ్రులైన వృద్ధులను సరిగా పట్టించుకోకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఎండీపీవో ఎ.వెంకటరమణ మాట్లాడుతూ, వృద్ధ మిత్ర యాప్ ద్వారా సమగ్ర సమాచారాన్ని సేకరించాలన్నారు. ఎస్సై పి.సుబ్రహ్మణ్యం, మండల పశువైద్యాధికారి డాక్టర్ పి.మనోజ్‌కుమార్, సీనియర్ సిటిజన్స్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షకు హాజరైన ఎన్‌సీసీ కేడెట్‌లు

ఎన్‌సీసీ ప్రాక్టికల్ పరీక్షలు

గూడూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ ప్రాక్టికల్ పరీక్షను పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించారు. హవాల్దర్ నజార్ హుస్సేన్, హవాల్దార్ జితేంద్ర కంపాస్, ఫీల్డ్ క్రాఫ్ట్, బ్యాటిల్ క్రాఫ్ట్, 0.22 రైఫిల్, డ్రిల్ టెస్ట్ తదితర వాటిపై ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు డి. పుష్ప లత, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం. అరుణ, సిహెచ్. రాజేష్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.